ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 సంచిక : 4 డిసెంబరు 2019



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977


ఈ సంచికలో....


23-12-1984, జిన్నూరు

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## అరుణాచల దీపోత్సవం

**స్మరణ మాత్రముననే పరముక్తి ఫలద।**

**కరుణామృత జలధి అరుణాచలమిది॥**

అరుణాచలంలో అతిప్రసిద్ధమైన పండుగ కార్తీక దీపోత్సవం. ఈ దీపోత్సవం క్రీస్తుపూర్వం 2000 సం॥ల క్రితము నుండి జరపబడుతోందని చెబుతారు. పవిత్ర అరుణగిరి అనాదిగా అనేకమంది మహాత్ములను, ఋషులను, సత్యాన్వేషకులను, తనవైపు ఆకర్షించుకుంటూనే ఉంది! భగవాన్ శ్రీరమణమహర్షి 1896 నుండి 1950లో మహానిర్వాణము చెందేవరకూ, అరుణాచలమును తన ఆవాసముగా చేసుకున్నారు. ఆ కాలములో అరుణాచలమును విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లలేదు సరికదా, అసలు అరుణాచలమును విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్లాలనే తలంపు కూడా ఉదయించలేదు అన్నారు. ఎలాగైతే అరుణగిరి అనేకమందిని తనవైపు ఆకర్షించిందో, అలాగే భగవాన్ శ్రీరమణుడు, సత్యాన్వేషకులను తనవైపు ఆకర్షించుకున్నారు. ఆయన 'అనుగ్రహమే' అందరిని ఆకర్షించింది. మాంసనేత్రాలకు రాళ్లగుట్టగా, సామాన్యముగా కనిపించే కొండ, భగవాన్ శ్రీరమణుడికి గురువు మరియు చిదానందబ్రహ్మము. అరుణగిరిపై గల అనంతమైన ప్రేమచేతనే ఆయన గిరికి ప్రదక్షిణం చెయ్యడం, గిరిపై పలుచోట్ల గుహలలో సంచరించడం, అరుణగిరిని చూచి తన్మయం చెందడం జరిగేది. భగవాన్ సాక్షాత్తు నడియాడిన అరుణాచలేశ్వరుడే! అరుణాచలమును తనకు అన్యముగా భగవాన్ ఎప్పుడు తలంచి ఎరుగరు. కార్తీక దీపాన్ని వెలిగించడానికి కొంచెం ముందుగానే భగవాన్ సోఫాలో కూర్చుని, దూరదర్శిని సహాయముతో, అరుణగిరి శిఖరాన్ని దృష్టి మరల్చక చూస్తూ ఉండేవారు. "కార్తీక దీపోత్సవాన్ని తిలకించినప్పుడు నా శరీరము

పులకించి, ఆనంద భాష్పాలు వస్తాయి అని చెప్పి మౌనం వహించేవారు". అరుణగిరికి 'అందని కొండ' అని పేరు, అనగా వాక్కుకు, మనస్సుకు అందని జ్యోతి స్వరూపము. బ్రహ్మకు, విష్ణువుకు జ్యోతి స్థంభముగా గోచరించిన శివుడే, తరువాత అరుణగిరి రూపం ధరించాడు. కొండ ఈశ్వరుని స్థూలరూపం, జ్యోతి సూక్ష్మరూపం.

(ది॥ 10-12-2019 అరుణాచల దీపోత్సవం సందర్భముగా)

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది. కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి బోధామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేయబడినది. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు

**సంవత్సర చందా** రు॥ **150**/-లు

## ముఖ్య గమనిక

రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.

సెల్ : **8883147999**

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. **520101264185724** (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883147999కు తెలియపరచగలరు.



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 23 డిసెంబరు 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

శంకరాచార్యులు వారు ఈ జగత్తు అంతా కూడా స్వప్నంతోటి సమానము అని చెబుతున్నారు. జగత్తు అంటే మన కళ్ళకు కనిపించే లోకం. ఈ లోకం గాలి, నిప్పు, నీరు, ఆకాశం, మట్టి ఈ పంచభూతాల తోటి తయారయ్యింది. శరీరం కూడా ఈ పంచభూతాల తోటే తయారయ్యింది. ఈ పంచభూతాలతో తయారైన శవం కాలుతోంటే మనం చూసినప్పుడు నీరు నీరు కింద కారిపోతూ ఉంటుంది, గాలి గాలిలో కలిసిపోతుంది, మట్టి మట్టిలో కలిసిపోతుంది, దేనికదే విడిపోతుంది. ఆచార్యుల వారి గురువుగారేమో గోవింద పాదుడు. గోవిందపాదుడి గురువు గారు గౌడపాదుడు. ఆ గౌడపాదుడు బదరీలో ఉండేవారు. ఆయనేమన్నాడంటే ఈ లోకం అసలు లేనే లేదు అన్నారు. లోకం ఉంది కాని, అది స్వప్నం అంటున్నారు ఆచార్యులు వారు. కానీ గౌడపాదుడు అసలు లేనే లేదంటున్నారు. గౌడపాదుడు చెప్పేది కుందేటికొమ్ము అని, కుందేలుకు కొమ్ము అసలు ఉండదు. కుందేలు కొమ్ము ఎంత అబద్ధమో ఈ ప్రపంచం కూడా అంతే అబద్ధం. కుందేలు కొమ్ము లావుగా ఉంటుందా, సన్నగా ఉంటుందా, అంటే అసలు కొమ్ము ఉంటే కదా! అలాగే ఈ లోకం స్వప్నం కాదు, ఏదీ కాదు, అసలు లేదు అన్నారు ఆయన. గౌడపాదుని మీరు ఎవరైనా ఆక్షేపించవచ్చు. మీరు గాఢనిద్రలో ఉన్నారనుకోండి, ఆ గాఢనిద్రలో ఉన్నప్పుడు ఈ జగత్తు లేదు. గాఢనిద్రలో ఈ జగత్తు ఎక్కడుంది అసలు? మీ అనుభవంలో చెప్పండి. అక్కడ ప్రపంచవిషయాలైన చావు గొడవ కాని, పుట్టుక గొడవ కాని, మీ శరీరం గొడవ కాని, గాఢనిద్రలో ఉందా అసలు?

స్వప్నాల ప్రయోజనం ఏమీ లేదు అని మీరు అనుకోవద్దు. మనలో ఉన్న బలహీనతలు స్వప్నంలో తెలుస్తూ ఉంటాయి. అంటే స్వప్నాలవల్లకూడా ఒక ప్రయోజనం ఉంది. కాని అది కరెక్ట్ స్టేట్ మట్టుకు కాదు. స్వప్నాలలో మన బలహీనతలు తెలుస్తాయి. మన ముఖంలో ఏవైనా మచ్చలు ఉన్నాయా, లేక సరిగ్గా ఉందా అని ముఖం అద్దంలో ఎలా

చూసుకుంటామో, ఈ రాత్రుళ్ళు వచ్చే స్వప్నాల విషయంలో మీ అంతఃకరణంలో ఏముందో మీకు తెలుస్తుంది. గాఢనిద్రలో మీకు జగత్తు లేదు, ఇది కూడా ఒక తలంపే, జగత్తు అంటూ లేదని గౌడపాదుడు చెప్పారు. గౌడపాదుని సిద్ధాంతం ప్రకారం మనం పుట్టలేదు అసలు! మనం ఇలా కూర్చుని మాట్లాడుకోవడం కూడా అబద్ధం అన్నారు. మనం పుట్టడం అబద్ధం అన్నారు. ఏంటండి మనం ఇలా పుట్టాం, మాట్లాడుకుంటున్నాం. ఇదంతా అబద్ధం అంటే ఎలా కుదురుతుంది అని? నువ్వు జన్మించావంటే ఎవరు జన్మించారు? శరీరం జన్మించింది. శరీరం నువ్వు కాదు, శరీరం మరణిస్తుంది. శరీరం నువ్వు కాదు. శరీరం జన్మించింది అనుకో ఎన్నోవికారాలు వస్తాయి. జన్మించిన ప్రతి వస్తువుకి కూడా వికారం ఉంటుంది.

మనం అందరం దేవుణ్ణి ప్రార్థించి, ప్రార్థించి, శుభాన్ని కోరుకుంటాం. మీరు శుభాన్ని కోరుకోవచ్చు కాని దాని వెంట అశుభం కూడా వస్తుంది. ఇంప్లయిడ్ అది. అందులో కలిసే ఉంటుంది. అది మనకు తెలియదు శుభాన్ని కోరుకునే ప్రతి ఒక్కరు అశుభం కూడా వస్తుందనుకునే కోరుకోవాలి. కాని కోరుకునేటపుడు అశుభం ఉండదు, శుభమే వస్తుంది అనుకుంటారు. శుభాన్ని కోరుకోవటం తప్పు కాదు. కాని మనిషి కూడా నీడ వచ్చినట్టు, శుభం వెనకాల అశుభం కూడా వస్తుంది. అందుచేత ఇక్కడ ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే, జాగృతి యొక్క వ్యవహారం అంతా కూడా స్వప్నంతో సమానం. అయితే జాగృతిలో వ్యవహారమే కాదు, మనం మరణించటం కూడా స్వప్నంలో భాగం. ఈ శరీరం మరణిస్తుంది కదా ఏదో ఒక రోజున, అది కూడా స్వప్నంలో ఒక భాగం. ఈ శరీరం పడిపోయిన తర్వాత కొత్త శరీరం ఒకటి వస్తుంది, అది కూడా స్వప్నమే. ఇది ఆచార్యుల వారి సిద్ధాంతం. గౌడపాదుడు అయితే శరీరం అసలు లేనే లేదన్నాడు. శరీరం కూడా ఒక తలంపే అన్నారు. ఎందుచేతంటే మనకి తలంపులు రాక ముందు ఈ శరీరం గొడవ లేదు. శరీరం అనే తలంపు వచ్చాక, ఈ శరీరం అంటే మీకు ఇష్టం. తలంపు రాక ముందు, ఈ శరీరం దృష్టి కూడా మీకు లేదు.

మీరేమనుకుంటున్నారు? ఎంతో కొంత మనకి భక్తి ఉంది కదా అని అనుకుంటున్నారు. కాని మీ తలంపులలో మీకు ఉన్న ప్రాపంచిక తలంపుల కంటే లోకానికి సంబంధించిన తలంపుల కంటే, మీకున్న భక్తి తలంపు బలంగా ఉందో లేదో చూసుకోవాలి. చిన్న రహస్యం ఒకటుంది. మీకు అనేక తలంపులు ఉన్నాయి. అన్ని తలంపులతో పాటు భగవంతుని మీద భక్తి కూడా మీకు ఉంది. భక్తి కూడా ఒక తలంపే. మీరు గంట సేపు ధ్యానం చేస్తారనుకోండి, కొంతమంది చెయ్యలేక పోతున్నారనుకోండి. చెయ్యలేక పోవడానికి కారణం, మీలో వాసనా బలం ఎక్కువగా ఉందనుకోండి మీరు ధ్యానం చెయ్యలేరు. ఒక పది నిముషాలు కూడా ప్రశాంతంగా మీరు కూర్చోలేరు. సంస్కారాలు, తలంపులు, వాసనలు, మనలో ఎక్కువగా ఉన్నాయనుకోండి మనం ధ్యానం చెయ్యటానికి ప్రశాంతంగా కూర్చోలేము. ఈ వాసనలు కుదురుగా కూర్చోనివ్వవు. లోపల ఉన్న సంస్కారాలు, తలంపులు, వాసనలు,

క్షయం అయ్యేవరకు ధ్యానం చెయ్యలేరు. మన ధ్యానానికి ఇవే అడ్డు వస్తున్నాయి. మరి ధ్యానం చెయ్యకపోతే ఎలా తగ్గుతాయండి అని మీరు అడగవచ్చు. కష్టమే చెయ్యటం కాని, వాసనలు సంస్కారాలు తగ్గించుకొంటూ, సైడ్ బై సైడ్ ధ్యానం కూడా చెయ్యాలి.

ధ్యానం చెయ్యటం వల్ల లాభం ఏమిటంటే - మన శరీరానికి ఆహారం లేకపోతే, ఎలా అయితే చిక్కుతుందో, ధ్యానం చెయ్యటం వల్ల ఏమి అవుతుందంటే మీ లోపల ఉన్న సంస్కారాలు, వాసనలు, సన్నగిల్లిపోతాయి, బాగా చిక్కిపోతాయి. అవి చిక్కే కొలది ధ్యానం యొక్క శక్తి పెరుగుతుంది. మనకి వాసనా బలం తగ్గాలి. సంస్కార బలం తగ్గాలి. తలంపుల బలం తగ్గాలి. ధ్యాన బలం పెరగాలి. మనం ఏమి చేస్తున్నాం? శరీర బలం పెరుగుతుందో, లేదో చూసుకుంటున్నాంగాని ధ్యానబలం పెరుగుతుందో లేదో చూసుకోవటం లేదు. శరీర బలం మంచిదే కాని శరీరబలం కంటే కూడా ధ్యానబలం ముఖ్యం. శరీరబలం ఎంత ఉన్నప్పటికీ స్మశానంతోటి ఆ శరీరం యొక్క చరిత్ర ముగిసిపోతుంది. మనకి అందమైన శరీరం ఉందనుకోండి, ఆరోగ్యకరమైన శరీరం ఉందనుకోండి, మంచిదే కాని స్మశానంతోటి ఆ శరీరగతమైన చరిత్ర ముగిసిపోతుంది. అయితే ధ్యాన బలం పెరగటం వల్ల ప్రాపంచిక వాసనలు సన్నగిల్లుతాయి. మనం ఈ లోకంలోకి వచ్చినటువంటి ప్రయోజనం అదే అసలు. గత జన్మల నుండి మనం మోసుకొచ్చినటువంటి, మన భుజాన వేసుకొచ్చినటువంటి వాసనలు సన్నగిల్లేలా చేయటమే మనం చెయ్యవలసినటువంటి ప్రథమ కర్తవ్యం, ప్రధాన కర్తవ్యం, మొదటి పని, మధ్య పని, చివరి పని కూడా అదే.

అందుచేత కృష్ణుడు గీతలో ఏమి చెప్పాడంటే, నువ్వు మరణించే సమయంలో, కొద్ది క్షణాల్లో మీ ప్రాణం పోతుందనుకోండి ఏ తలంపైతే మీకు లోపల బలంగా పని చేస్తుందో అది మెదడులోకి వచ్చి రాబోయే జన్మని నిర్ణయిస్తుంది. అంటే మన హృదయంలో తలంపులు ఉంటాయి. భగవంతుడు హృదయ నివాసి. తలంపులు అన్నీ హృదయంలో ఉంటాయి. ఒకదాని తరువాత మరొకటి శిరస్సులోకి వస్తూ ఉంటాయి. ఇప్పుడు అలాగే వస్తాయి. మరణించేటప్పుడు కూడా అలాగే వస్తాయి. అయితే మరణించేటప్పుడు భగవంతుడు చెప్పిన సీక్రెట్ ఏంటంటే, ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి. ఇప్పుడు మనం చెప్పకునే మాటలు కూడా గాలిలో మాటలు అని మీరు అనుకోవద్దు, పర్ఫెక్ట్ సైన్సు. నూటికి నూరు పాళ్ళు ఇది కూడా సైన్సే. మీకున్న తలంపులలో, మీకున్న వాసనలలో, మీకున్న సంస్కారాల్లో, ఏ సంస్కారమైతే బలంగా ఉందో, ఏ తలంపైతే బలంగా ఉందో, ఏ వాసనైతే బలంగా ఉందో, అదే సరిగ్గా మెదడులోకి వచ్చి కూర్చుంటుంది. మనసులోకి వచ్చి కూర్చుంటుంది. అదే మీకు తర్వాత వచ్చే జన్మని నిర్ణయం చేస్తుంది. ఇందులో నాకు పక్షపాతం ఏమీ లేదు సుమా అని భగవంతుడు చెపుతున్నాడు. నా మీద ఏమీ నెపం వేయకు అంటున్నాడు, దేవుడికి కనుక పక్షపాతం ఉంటే దేవుడు అవుతాడా? దేవుడు అవ్వడు. అందుచేత భగవంతుడు చెప్పే విషయం చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. మనం ఏం అనుకుంటున్నాం? మనకు ఎంతో కొంత భక్తి ఉంది.

ఈ వాసనలు మనం మరణించే టైములో వస్తాయి అనుకుంటున్నాం. అలా రావు. లోక వాసనలు మనలో బలంగా ఉన్నాయి. భక్తి బీజాలు కూడా ఉన్నాయి. కాని మరణించే సమయం వచ్చేసరికి సన్నంగా, బలహీనంగా ఉండే భక్తికి సంబంధించిన వాసనలు అన్నీ పడిపోతాయి. ఏ ప్రాపంచిక తలంపు మనలో బలంగా ఉందో అదే వచ్చి కూర్చుంటుంది. దానినిబట్టి రాబోయే జన్మ నిర్ణయింపబడుతుంది.

భగవంతుడు చెప్పిన దానిని కొంతమంది చులకనగా తీసుకుంటున్నారు. తేలికగా ఎందుకు తీసుకుంటున్నారంటే, మనలో జ్ఞానం లేక, మనలో భక్తి లేక, అసలు భక్తికి సంబంధించిన సంస్కారం లేక భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం అనిపిస్తాయి. భగవంతుడు చెప్పినవి ఎందుకు అబద్ధం అనిపిస్తాయంటే మన హృదయంలో పాపం ఉంటుంది. ఒకటే గుర్తుంచుకోండి. భగవంతుడు చెప్పిన మాటలు మీ మనస్సు అంగీకరించపోతే మీ మనసులో పాపం ఉందని అర్థం. మీరు ఎవరినో సలహా అడగనక్కరలేదు. కోర్టుకు వెళ్ళక్కర్లేదు. మీకు భగవంతుడు చెప్పిన మాటల మీద నమ్మకం కలగకపోతే, విశ్వాసం కలగకపోతే, మన హృదయంలో దోషం ఉందని అర్థం. బలహీనతలు ఉన్నాయని అర్థం. మన మనసులో ఏదో రోగం ఉందని అర్థం.

మనం చుట్టాలకి ఇచ్చే విలువ, మన బంధువులకి ఇచ్చే విలువ, మన స్నేహితులకి ఇచ్చే విలువ, మనం భగవంతుడికి ఇవ్వటం లేదు. కారణం ఏంటి? ఇదే మాయ. శంకరాచార్యుల వారు ఈ లోకం మాయ, మాయ అంటే అందరూ ఆక్షేపిస్తారు. ఇదేంటండీ, మాయ అని ఎందుకు అంటున్నారని? ఎందుచేత అంటే ఈ జన్మలో ఉండే నా బంధువులు అందరూ మారి పోవచ్చు, ఈ జన్మలో ఉన్న స్నేహితులు అందరూ మారి పోవచ్చు, ఈ జన్మలో ఉన్న పరిసరాలు అన్నీ మారిపోవచ్చు, కాని నాకు జ్ఞానం కలిగే వరకు నాకు తోడుగా, నాకు నీడగా, నాకు సన్నిహితుడిగా, నాకు సహచర్యుడిగా, నా శ్రేయస్సు కోరుతూ జన్మజన్మలకి, నాకు జ్ఞానం కలిగే వరకూ నాకూడా వచ్చేవాడు భగవంతుడు ఒక్కడే. ఇదే మరచిపోతున్నారు. మనం అందరం మళ్ళీ జన్మలో జంతువులం అవ్వచ్చు. ఇప్పుడు జంతువులుగా ఉండి మళ్లీ జన్మలో మనుషులుగా రావచ్చు. మనుషులలో కొంత మంది దేవతలు అవ్వచ్చు. దేవతలు మనుషులలోకి రావచ్చు. నిజం తెలుసుకునే వరకు, సత్యాన్ని తెలుసుకునే వరకు మనం ఇలా ప్రయాణాలు చేస్తూ ఉండవలసిందే. అయితే ఈ ప్రయాణాలలో కూడా జంతుజన్మ ఎత్తినప్పటికి, మానవ జన్మ ఎత్తినప్పటికీ, స్వర్గ లోకంలోకి వెళ్ళినప్పటికీ, మన కూడా ఉండేవాడు దేవుడు, ఈశ్వరుడు ఒక్కడే. అది ఒక్కటే మరిచిపోవద్దు. అయితే మన కూడా ఉండని వాళ్ల మీద ఉన్న ప్రేమ కూడా మనకి ఈశ్వరుడు మీద లేదు కాబట్టి ఇదంతా మాయ అంటున్నారు ఆచార్యులవారు.

కనీసం ఎవరు మన శ్రేయస్సు కోరుతున్నారో తెలియనటువంటి బలహీనత మనది. కనీసం ఎవరు మీ శ్రేయస్సు కోరుతున్నారో మీకు తెలియదు. ఈశ్వరుడు మనని లాలించి, బుజ్జగించి అనేక మాటలను మనకి చెబుతుంటే, ఈశ్వరుడు మన శ్రేయస్సు ఎంత

కోరుతున్నాడో కూడా అవగాహన లేదు. మనకు తల్లి ఈశ్వరుడు, తండ్రి ఈశ్వరుడు, బంధువు ఈశ్వరుడు, అంతా సమస్తం ఈశ్వరుడు. ఈశ్వరుడి కంటే మన శ్రేయస్సు కోరే వారు ఎవరూ ఈ భూమి మీద లేరు. ఒకవేళ ఉన్నారని ఎవరైనా అనుకుంటే అదే మాయ. ఈశ్వరుడు కంటే మీ శ్రేయస్సు కోరే వాడు, గురువు కంటే నీ శ్రేయస్సు కోరేవాడు, ఎవరైనా ఈ లోకంలో ఉన్నారా? ఈ లోకంలో గాని, పరలోకంలో గాని ఉన్నారని అనుకుంటే అది మీ మనసు చేసే మాయ. అది నిజం కాదు. నీ మనసు అలా మాయ చేస్తుంది కాబట్టి, మీరు అబద్ధాన్ని నిజం అనుకుంటున్నారు. అది నిజం కాదు. నిజాన్ని నమ్మితే మంచిదే కాని మనం నిజాన్ని నమ్మలేకపోతున్నాం. ఎందుకంటే మనసు నిజాన్ని నమ్మలేదు. అందుచేత, ఇప్పటినుంచీ ధ్యానం చేయటం వల్ల, మౌనం అభ్యాసం చేయడం వల్ల, ఈ శరీరం పడిపోక ముందే ఎవరైతే తనలో ఉన్న ప్రాపంచిక వాసనలను సన్నగిల్లింప చేసుకుంటున్నాడో, వాటిని బలహీనపరుస్తున్నాడో, వారికి దైవానికి సంబంధించిన సంకల్పం ఒకటే బలంగా నిలబడి ఉంటుంది. ఆ విధంగా నువ్వు మరణించే టైముకి రెడీగా ఉంటే ఆ సంకల్పమే నీకు వస్తుంది. అప్పుడు రాబోయే గొప్ప జన్మలకి నువ్వు అర్హత సంపాదిస్తావు, డిజర్వ్ అవుతావు అని చెబుతున్నారు ఈశ్వరుడు. భగవంతుడు చెప్పిన మాటలు నూటికి నూరుపాళ్లు నిజం. 99% కాదు. నూటికి నూరుపాళ్ళు నిజం.

ఇక్కడ ఆచార్యులవారు జగత్తంతా స్వప్నం అంటున్నారు. కాని అది మనకి నిజంగా కనిపిస్తోందా? స్వప్నంగా కనిపిస్తోందా?నిజంగా కనిపిస్తోంది కాబట్టే మనసు బహిర్ముఖం అవుతుంది. ఆచార్యుల వారు చెప్పినట్లుగా మనం స్వప్నంగా చూడలేకపోతే, ఈ లోకాన్ని నిజంగానే మనం చూస్తూ ఉంటే, మీరు ధ్యానాలే చేయండి, పూజలు చేయండి, యాత్రలకి వెళ్లండి, నదులలో మునగండి, ఎన్ని పనులు చేసినప్పటికీ, ఎన్ని పూజలు చేసినప్పటికీ మీ మనస్సు మిమ్మల్ని మాయ చేసి బయటకి వచ్చేస్తూ ఉంటుంది. మీరు బయటకి నోటితోటి రామ రామ అనవచ్చు, కానీ హృదయంలో రాముడు అబద్ధం అనుకుంటున్నారు, లోకం నిజం అనుకుంటున్నారు. అందుచేత మనం ఎన్ని చెప్పుకున్నప్పటికీ, మీరు ఎన్ని సాధనలు చేసినప్పటికీ, ప్రపంచం నిజం అని మనం నమ్ముతున్నాం కాబట్టి మనసు బయటకి రావడం మానదు.

ఈ ప్రపంచం స్వప్నమే, ఆచార్యుల వారు చెప్పింది రైటే, అయితే జగత్తంతా స్వప్నం అని ఎవరికి తెలుస్తుంది? మీరు, నేను ఇక్కడ కూర్చుని గంటల తరబడి చెప్పుకున్నా తెలియదు. ఎవరికి తెలుస్తుంది? ఎవరికైతే పూర్తిగా వాసనా క్షయం అయ్యిందో, ఎవరికైతే వారిలో ఉన్న బలహీనతలు పూర్తిగా రాలిపోయినాయో, వారికి మాత్రమే ఇది స్వప్నం అని తెలుస్తుంది. భగవంతుడు ఎక్కడున్నాడు? భగవంతుడు ఎక్కడో ఉన్నాడని మన ఉద్దేశం. మీ ఇల్లు కంటే మీ శరీరం మీకు దగ్గర. మీ శరీరం కంటే మీకు భగవంతుడు దగ్గరగా ఉన్నాడు. అయితే మనం ఎక్కడో ఉన్నాడు అనుకుంటున్నాం. భగవంతుడు నిజమైన ఆత్మ రూపంలో

మనలోనే ఉన్నాడు. అయితే మనలో బలహీనతలు ఉన్నా కూడా మనల్ని విడిచి పెట్టడం లేదు. అలా పట్టుకుని రక్షిస్తూ, ఆయనని తెలుసుకోవడానికి తగిన అవకాశాలు చూపిస్తూ, మనలని గాలిలో విడిచిపెట్టకుండా అలా పట్టుకొని, మన కూడా ఉన్నాడు.

ఒక విషయాన్ని మనసులో పెట్టుకోండి. మీరు వ్యవసాయ దారులా, లేక వ్యాపారస్థులా, లేక ధనవంతులా, పేదవాళ్ళా, విద్యావంతులా, విద్య లేనివాళ్ళా, అవి ప్రధానం కానేకాదు. మీ గమ్యం భగవంతుడు అవునా కాదా? మీరు వ్యవసాయం చేసుకోవచ్చు లేదా వ్యాపారం చేసుకోవచ్చు, ఉద్యోగం చేసుకోవచ్చు. మీ గమ్యం ఏమిటి? ఇది మీరు నిర్ణయం చేసుకోండి. మీ గోల్ ఏమిటి అసలు? గమ్యమే నిర్ణయించుకోనప్పుడు, గమ్యానికి ఎలా చేరుకోగలం. జిన్నూరు వెళ్ళాలి ప్రతి ఆదివారం అని మనసులో అనుకోకుండా ఊరికే వచ్చేయగలరా ఇక్కడికి? ముందు ఆ తలంపు రావాలి కదా. తలంపు వచ్చిన తరువాత శరీరం ఇక్కడికి వస్తుంది. తలంపు రాకుండా శరీరం వస్తుందా, తలంపు వచ్చిన తరువాతే మీ శరీరం బయలుదేరుతుంది. తలంపు లేకుండా మీ శరీరం కదలదు కదా. అలాగే, గమ్యం ఏమిటి మీకు? ఇది ఆలోచించండి. మన గమ్యం ఏమిటి? భగవంతుడే. ఈశ్వరుడు మనలో ఆత్మగా ప్రకాశిస్తున్నాడు. ఆత్మను తెలుసుకునే వరకు, ఏ జీవుడినీ దుఃఖం విడిచిపెట్టదు. ఏ జీవుడూ స్వతంత్రుడు కాలేడు. ఎవరినీ జన్మలు విడిచి పెట్టవు. ప్రకృతి విడిచి పెట్టదు. ప్రకృతి రాసి రాసి రంపాన పెడుతుంది.

మన గమ్య స్థానం ఏమిటి? కనీసం మీరు ప్రయాణం ఎంత వరకూ చేసారు అని అడగటం లేదు. మిమ్మల్ని ప్రయాణం చెయ్యమని అడగటం లేదు. మిమ్మల్ని కష్టపడి సాధన చేయమని అడగటం లేదు. ఏమీ అడగటం లేదు. మన గమ్యం ఏమిటి? మీరు స్త్రీలా, పురుషులా అని అడగటం లేదు నేను. మీరు రాజులా బ్రాహ్మణులా అని అడగటం లేదు. మీరు ఏ వర్ణం అని అడగటం లేదు? దేశీయులా, పర దేశీయులా అని అడగటం లేదు. కాని మీ మనసులో కనీసం మనం పొందవలసిన వస్తువు ఏది అని విమర్శనాత్మక దృష్టితోటి మీరెప్పుడైన ఆలోచించారా? గోల్ నిర్ణయించుకోండి. మీరు గోధుమలే తింటున్నారా, వరి అన్నమే తింటున్నారా, అరటిపళ్ళతో కాలక్షేపం చేస్తున్నారా, అది కాదు నేను అడిగేది. గోల్ నిర్ణయించుకోండి. గమ్య స్థానానికి సంబంధించినంత వరకు మీరు ఎప్పుడైనా ఒక నిర్ణయానికి వచ్చారా? మనం పొందవలసింది ఏమిటి? పొందవలసింది ఒక నిర్ణయానికి రానప్పుడు, ఒక గమ్యం లేనప్పుడు, ఒక ఆదర్శం లేనప్పుడు, ఒక లక్ష్యం లేనప్పుడు, ఒక కాంక్ష లేనప్పుడు, ప్రయాణం ఎలా చేస్తాం?

అసలు కాశి వెళ్ళాలని ఎప్పుడైనా తలంపు వస్తే, దానికి సంబంధించిన సామాను సర్దుకుంటాం. డబ్బు సంపాదించుకుంటాం, టికెట్టు సంపాదిస్తాం, ట్రైన్ టైం తెలుసుకుంటాం, తరువాత వెళ్ళటం వేరే విషయం. కాశి వెళ్ళాలి అని ప్రయాణం అనుకున్న తర్వాత కదా దానికి సంబంధించిన సామాగ్రి, పెట్టి, బెడ్డింగు సర్దుకోవటం! అసలు ప్రయాణం తలంపే లేనపుడు ఇంక ఈ పెట్టెలు, సామాన్లు సర్దుకోవటం ఏముంటుంది? అదే విధంగా మీరు

అసలు భగవంతుడిని తెలుసుకోవాలి. మనలో ఆత్మగా ప్రకాశిస్తున్న ఈశ్వరుడిని ప్రత్యక్షం చేసుకోవాలనే నిర్ణయానికి మీరు ఎప్పుడైనా వచ్చారా? మీ గమ్య స్థానాన్ని ముందు మీరు నిర్ణయించుకున్నారా? అది ముఖ్యం, అది ప్రశాంతంగా మీరు ఆలోచించండి.

ఒక రహస్యం చెబుతున్నాను గుర్తుంచుకోండి. జ్ఞాని ప్రేమించినట్టుగా ఈ లోకాన్ని ఎవరూ ప్రేమించలేరు. అజ్ఞాని ఈ లోకాన్ని ప్రేమించలేడు. అందుకే రమణమహర్షి గారు సోషల్ రిఫార్మ్‌కి ప్రాముఖ్యత ఇవ్వలేదు, సెల్ఫ్ రిఫార్మ్‌కి ప్రాధాన్యత ఇచ్చారు. నిన్ను నువ్వు బాగుచేసుకోక పోతే, ఇక సంఘాన్ని బాగు చేయలేవు. నిన్ను నువ్వు బాగుచేసుకోవటం మానేసి సంఘాన్ని బాగు చేస్తాను అంటే, సంఘంలో నువ్వు పనికిరాని వాడిగా ఉన్నావు, నేను సంఘాన్ని బాగు చేస్తాను అంటావేంటి? నిన్ను నువ్వు బాగు చేసుకున్న తర్వాత సంఘాన్ని బాగు చేద్దువు గాని, నిన్ను నువ్వు బాగు చేసుకోడానికి ప్రయత్నం చేయటం మానేసి, సంఘాన్ని బాగు చేస్తాను అనడం కూడా ఒక మాయే. ప్రతి వాడూ చేసే పని ఇదే. ఈ పొరపాటు ప్రతివాడూ చేస్తున్నాడు, ఇక్కడే ఫెయిల్ అవుతున్నాడు. ఈలోకాన్ని మనం అందరం ప్రేమిస్తున్నాం అని అనుకుంటున్నాం. మనం ఎవరం ప్రేమించటం లేదు. ఎవడి హృదయంలో శాంతి ఉందో, వాడు ఎదుటి వాడిని ప్రేమించగలడు గాని, తన హృదయంలోనే శాంతి లేని వాడు ఎదుటి వాడిని ప్రేమించలేడు. నా మాట నమ్మండి. ఒకవేళ ఎవరైనా ప్రేమిస్తున్నా అని చెప్పినా, అది అబద్ధం. నీ హృదయంలోనే శాంతి లేనప్పుడు, మీరు లోకాన్ని ఎక్కడ నుంచి ప్రేమిస్తారు? ఎలా ప్రేమిస్తారు? ఎందుకు ప్రేమిస్తారు? నిరంతరం హృదయంలో అశాంతితో ఉడికిపోతుంటే మనిషి దేవుడిని ప్రేమించగలడా? తోటివాడిని ప్రేమించగలడా? కనిపిస్తున్న ఈ లోకాన్ని ప్రేమించగలడా? ఈ విషయం బాగా ఆలోచించండి. హృదయంలో ఉన్న శాంతి యొక్క రుచి గాని, అటువంటి అనుభవం గాని మీరు ఎప్పుడైనా పొందారా? పొందకుండా మీరు ఎవరిని ప్రేమిస్తారు?

కామం దుఃఖాన్ని తీసుకువస్తుంది. కామం బాధ తీసుకువస్తుంది. ప్రేమ శాంతిని తీసుకువస్తుంది. ప్రేమ జ్ఞానాన్ని తీసుకువస్తుంది. ప్రేమ వేరు, కామం వేరు. సంఘాన్ని ప్రేమించండి, ఇంట్లో మనుషులని ప్రేమించండి. ఊరిని ప్రేమించండి. దేశాన్ని ప్రేమించండి. ఇవన్నీ పుస్తకాల్లో మాటలు. కాని నాహృదయంలో శాంతి లేనప్పుడు నేను ఎవరిని ప్రేమిస్తాను? ఇవన్నీ వొట్టి మాటలు. భగవాన్ జంతువులను కూడా వారు, వీరు అనేవారు. ఒక కుక్క ఉందనుకోండి, కుక్క అని ఎప్పుడూ పిలిచే వారు కాదు, పేరు పెట్టి వారు వచ్చారు అనేవారు (కురుప్పన్ గారు వచ్చారు అనేవారు). పాము వచ్చిందనుకోండి, దాన్ని కూడా వారు వచ్చారు అనేవారు. ఇలా జనం కూర్చున్నపుడు పాము వచ్చిందనుకోండి, ఏవండి మీరు జనాలు ఉన్నప్పుడు వస్తున్నారు. ఒంటరిగా ఉన్నప్పుడు రండి, అందరూ జడుస్తారు మిమ్మల్ని చూసి, మళ్ళీ ఎవరూ లేనప్పుడు మీరొస్తే బాగుంటుంది అని చెప్పేవారు. అంటే ఏమిటి? మనది చర్మ దృష్టి, ఆయనది ఆత్మ దృష్టి. మనం చర్మాన్నే దాటలేని వాళ్ళం, ఇక ఆత్మని ఎక్కడ తెలుసుకుంటాం!

ఆత్మ దృష్టి ఉన్న వారికి లోకం అంతా ఆత్మగా కనపడుతుంది. మనకి దేహ దృష్టి కాబట్టి లోకం కూడా అలాగే కనపడుతుంది. జ్ఞానిది శివ దృష్టి, అజ్ఞానిది శవ దృష్టి. భగవంతుడు చెప్పిన విషయాలు మీరు విశ్వసించరు అనుకోండి, కోటి జన్మల తరువాత కూడా మళ్ళీ ఈ కంక్లుజన్‌కి రావలసిందే, ఇంక గత్యంతరం లేదు. నిజాన్ని తెలుసుకునే వరకు, మానవులకి ముక్తి లేదు. భగవాన్ని మీలో ఎవరైనా ప్రేమిస్తున్నారనుకోండి, ప్రేమించటానికి అసలు మీలో ప్రేమ ఉందా? ఆయనకి మీ ప్రేమ అవసరం లేదు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, ఈశ్వరుడు మన ప్రవర్తన చూసి, ఆయన ప్రేమ మన మీద పడితే ఆయన యందు మనకి ప్రేమ కలుగుతుంది కాని ప్రేమించడానికి మన దగ్గర ప్రేమ ఉంటే కదా! మనం ఆయన్ను ఎన్నుకోవటం కాదు. ఆయన మనల్ని ఎన్నుకోవాలి. ఈశ్వరుడు సర్వఅధికారి.

ఆకుకూరలవ్వ ఉందనుకోండి. ఎంత ప్రేమించింది! చదువు రాదు, డబ్బు, ఆస్తి ఏమీ లేదు, కట్టుకోవడానికి గుడ్డ ఒకటే, వండుకోవడానికి కుండ ఒక్కటే, ఆ కుండ లోనే నీళ్ళు కాచుకోవడం, ఆ కుండ లోనే కూర వండుకోవడం, ఆ కుండలోనే అన్నం వండుకోవడం అంత దారిద్ర్యం. మళ్ళీ జన్మలో లక్ష్మిగా జన్మించింది, ఆవిడకి మోక్షం వచ్చింది. మనకి ఎంత ఐశ్వర్యం ఉన్నా మనకి మోక్షం రావడం లేదు. కారణం, డబ్బుతోటి కొనుక్కునేది కాదు. డబ్బు మనకి గొప్ప, చదువు మనకి గొప్ప, అధికారం మనకి గొప్ప, కాని ఈశ్వరుడికి అవి గడ్డిపరకతోసమానం. ఇవన్నీ మనం కల్పించుకున్న గొప్పలు. మీకు స్వప్నంలో ఏ మంత్రి పదవి చేసినట్టో కల వచ్చి ఉండచ్చు. మెలకువ వచ్చాక నేను మంత్రి పదవి చేస్తున్నాను, రాత్రి నాకు స్వప్నం వచ్చింది నేను మంత్రిని, అని ఊరంతా తిరుగుతారా? జ్ఞానికి ఈ మంత్రి పదవులు అనవసరం. జగత్తులో జరిగే వ్యవహారాలు అన్నీకూడా స్వప్నంతో సమానం.

**కృతిమహోదధౌ పతన కారణం, ఫలమశాశ్వతం గతి నిరోధకం!**
**ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం, చిత్త శోధకం, ముక్తి సాధకం!**

ధనం అనుభవించేటప్పుడు, చదువు అనుభవించేటప్పుడు, అధికారం అనుభవించే టప్పుడు, బాగా అనుభవిస్తున్నాం మనకి రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని మీరంతా అనుకుంటూ ఉంటారు. ఇక్కడ భగవాన్ ఏమి చెప్పారంటే, మీరు అనుభవిస్తున్నాం మనకి రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకుంటున్నారు, కాని మనసుతో మీరు అనుభవించే భోగాలు అన్నీ కూడా సంస్కారాల రూపంలో, వాసనల రూపంలో హృదయంలోకి వెళ్ళి దాక్కుని ఉంటాయి అని చెప్పారు. దాక్కుని, మీరు ఖర్మ అనుభవించిన తరువాత కూడా ఈ సంస్కారం మిమ్మల్ని విడిచిపెట్టదు. ఇతర లోకాలకి వెళ్ళినా కూడా మిమ్మల్ని మోక్షం వైపుకి తిరగనివ్వదు అది. అంటే ఏమిటి? మీ మనసు ఆ సుఖం అనుభవించింది కదా, మీరు ఏ సుఖం అయితే అనుభవించారో, మళ్ళీ ఆ సుఖాన్నే కోరుకుంటుంది గాని మనసు భగవంతుని వైపు తిరగదు. అంటే కర్మ చేస్తాడు. కర్మ చేస్తే వాసన వస్తుంది. వాసనలకి ఆ కర్మే చెయ్యాలనిపిస్తుంది కాని ఈ వాసనలు భగవంతుని వైపు తిరగనివ్వవు. మీరు డబ్బు

వల్ల వచ్చే భోగాలని ఒకసారి రుచి చుశారనుకోండి మాటవరసకి, మళ్ళీ మనం డబ్బు సంపాదించాలి, మళ్ళీ భోగం అనుభవించాలి అనుకుంటాం. మీ మనసు ఇంక భగవంతుడి వైపు తిరగనివ్వదు.

పతనకారణం ఫలం అశాశ్వతం! మీరు గొప్ప పనులు చేయచ్చు, గొప్ప ఘనకార్యాలు చేయచ్చు, మంచి పనులు చేయచ్చు. వాటికి ఫలితం ఉన్న మాట నిజమే. ఫలం అశాశ్వతం! దానికి ఫలితం వస్తుంది, కొంతకాలం ఆ ఫలితం మీరు అనుభవిస్తారు. తరువాత ఫలితం అయిపోతుంది. ఫలం అశాశ్వతం! ఫలితం అంతా ఖర్చు అయిపోతుంది. తర్వాత కూడా అది పతన కారణం! ఏ ఫలితాన్ని అయితే మీరు అనుభవించారో, ఏ భోగాన్నైతే మీరు భోగించారో, మళ్ళీ ఆ భోగం వైపుకి మీ ఇంద్రియాలు మీ మనసుని బయటకి లాక్కుని పోతాయి కాబట్టి, అది పతన కారణం. ఈశ్వరుడి మీద మీరు గురి పెట్టలేరు. మళ్ళీ ప్రకృతిలోకి వచ్చేస్తారు.

ఎవరికైతే చిత్తంలో శుద్ధి ఉందో, వారికి ముక్తిని సాధించాలని కోరిక ఉంటుంది కాని, చిత్తశుద్ధి లేనివాడికి ముక్తి సాధకం ఎక్కడ కుదురుతుంది అంటున్నారు భగవాన్ ఉపదేశసారంలో. అంటే మనం చేసే పనులు ఫలితాన్ని కోరి చేస్తున్నాం కాని చిత్తశుద్ధి నిమిత్తం మనం చేయటంలేదు. చిత్త శుద్ధి కావాలి. చిత్తశుద్ది ఉన్నవాడి చిత్తం ఈశ్వరుడికి దారి చూపిస్తుంది. చిత్తశుద్ది లేకపోతే ఈశ్వరుడి వైపు దారే కనపడదు. ఆయన్ని చేరుకోగలరో లేదో అది వదిలేయండి. అసలు ఈశ్వరుడి వైపు దారే కనపడదు. అంచేత చిత్తశుద్ధి చాలా ముఖ్యం. అంటే మనం చేసే అన్ని పనుల్లోనీ చిత్తశుద్ధిని దృష్టిలో పెట్టుకునే పని చేయాలి. కాని చిత్తశుద్ది కోసం మనం పని చేయటం లేదు, దేనికోసం చేస్తున్నాం? ఫలితం ఆశించి పని చేస్తున్నాం. గొప్పల కోసం, మెప్పుల కోసం, ఏదోకటి లోకానికి సంబంధించిన ప్రయోజనం కాంక్షించే పని చేస్తాం. ఎందుకంటే లోకం నిజం అనుకుంటున్నాం కాబట్టి. ఆ ప్రయోజనం వస్తుంది. ఆ ఫలితం వస్తుంది. అది అనుభవిస్తారు. మళ్ళీ నువ్వు అనుభవించాక కొత్త వాసనలని తీసుకువస్తుంది. ఆ జన్మకి ఆ జన్మకి మనం సంసారంలో కూరుకుపోతాం.

మీ గురువు నిజమైన గురువు అయితే, వాడే గనక జ్ఞాని అయ్యుంటే, మిమ్మల్ని ఆత్మ వైపుకే గురి పెడతాడు. ఆత్మ ఒక్కటే నిజం. ఆత్మ వైపు గురి పెట్టకుండా వేరే ఏ లక్ష్యం వైపు గురి పెట్టినా వాడసలు గురువు కాదు, రాక్షసుడు. మీరు కష్టపడి, కష్టపడి, తొలిగించుకోలేని వాసనలు, సంస్కారాలు కూడా, గురువు అనుగ్రహం ఉంటే, ఈశ్వరుడి అనుగ్రహం ఉంటే కొన్ని సెకన్లలో కాలిపోతాయి. మనం నెత్తిమీద పెట్టుకొని మోయలేని దుంగలు నీటిలో పడేస్తే తేలికగా గెంటేయవచ్చు. ఈశ్వరానుగ్రహం గంగ లాంటిది. మీ నెత్తిమీద బరువైన వాసనలు కూడా, మీరు మోయలేని సంస్కారాలు మీ హృదయంలో ఉన్నప్పటికీ, ఈశ్వరుడిని పూర్తిగా మీరు విశ్వసిస్తే, ఈశ్వరానుగ్రహం మీ మీద పడితే, పెద్ద బలమైన దుంగలవంటి వాసనలు కూడా ఈశ్వరానుగ్రహం అనే కెరటంలో, ఈశ్వరానుగ్రహ ప్రవాహంలో కొట్టుకెళ్లిపోతాయి.

మీకు విషయం అర్థం అయ్యేలా చెప్పకపోతే అది మీ దోషం కాదు మా దోషం. అర్థం చేసుకోడానికి మించిన యోగం లేదు. భగవంతుడు ధ్యాన యోగం చెప్పాడు, కర్మ యోగం చెప్పాడు, జ్ఞాన యోగం చెప్పాడు, భక్తి యోగం చెప్పాడు. నాకు మనసులో ఇష్టం అయినది చెపుతున్నాను. అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే. అర్థం చేసుకోవడానికి మించిన యోగం లేదు. అసలు మీకు అర్థం అయితే కదా శ్రద్ధ కలిగేది. మీకు అర్థం అవ్వనప్పుడు శ్రద్ధ ఎలా కలుగుతుంది? మీకు అర్థం అవ్వనపుడు మీకు రుచి ఏమి తెలుస్తుంది? మీకు జీర్ణం అవ్వనపుడు మీకు బలం ఏమి వస్తుంది? తిన్నది జీర్ణం అయితే కదా, వంటబడితే కదా మీకు బలం వచ్చేది. నేను చెప్పిన విషయం మీకు అర్థం అవ్వలేదనుకోండి మీకు శక్తి ఎలా కలుగుతుంది? మీకు రుచి ఎలా తెలుస్తుంది? మీకు అర్థం అయ్యేలా చెప్పకపోతే నాలో ఏదో దోషం ఉన్నట్టే, నన్ను చూడగానే మీకు భగవంతుని వైపు ముఖం తిరగదు అనుకోండి ఆ లోపం నాదే, మీది కాదు.

ఈ దేహం మరణించిన తరువాత స్మశానంలో శవాన్ని కాల్చినప్పడు ఈ దేహం కాలిపోతుంది, ఇంద్రియాలు కాలిపోతాయి కానీ సూక్ష్మ దేహం మటుకు అలాగే ఉంటుంది. అలాగ ఉండిపోయి దానికొక కొత్త దేహం వస్తుంది. దానికి కొత్త దేహం వచ్చినప్పుడు మళ్ళీ పుట్టాం అనుకొంటున్నాము. మీరు పుట్టడం అంటే ఈ జీవుడేమీ మారడు వాడు అలాగే ఉంటాడు. ఇప్పుడు నేను ఇలా కూర్చున్నాను, ఈ చొక్కా తీసేశాను, ఇంకో చొక్కా వేసుకున్నాను నేను మారానా? నేను మారలేదు. చొక్కాయే మారింది. అలాగే జీవుడైన నేను ఏమీ మారను. ఈ దేహం పోతుంది, ఇంకో కొత్త దేహం వస్తుంది. చాలామంది, చనిపోయిన తర్వాత ఈ జీవుడు మారతాడు అనుకుంటున్నారు. జీవుడేమీ మారడు. పాతదేహం పడిపోయినప్పుడు చచ్చిపోయాడు అంటున్నారు. కొత్తదేహం వచ్చినప్పుడు పుట్టాడు అంటున్నారు. అయితే ఈ శరీరంలో ఉన్నప్పుడు మీకు ఉన్నటువంటి చుట్టాలకి, మళ్ళీ మీరు ఎక్కడ పుట్టారో, మీరు ఎక్కడ ఉన్నారో, ఏ స్థితిలో ఉన్నారో, వాళ్లకి అక్కరలేదు. ఈ బంధువులకి గాని, స్నేహితులకి గాని, నువ్వు ఎక్కడున్నా నీ కేర్ ఆఫ్ అడ్రెస్, వాళ్లకి అక్కరలేదు. కాని మిమ్మల్ని కూడా కనిపెట్టికుని ఉండి, మీరు ఏ లోకంలో ఉన్నా ఎక్కడున్నా సరే, మీ కూడా ఉండి, మిమ్మల్ని రక్షించే వరకు నిన్ను చూసేవాడు నీ గురువు, ఈశ్వరుడు.

పెరుమాళ్ళుస్వామి రమణ మహర్షి మీద కొన్ని అపవాదులు వేసి, కొన్ని బండ మాటలు అని, కొన్ని చెడ్డ మాటలు అని, ఒక పుస్తకం రాసారు. పుస్తకం రాయడం రాసేశాడు, ప్రింటు చేసేశాడు, పుస్తకం పోస్టులో పంపేశాడు. ఆరు నెలలకి భయం పట్టుకుంది. ఏంటి నేను రమణమహర్షి మీద చెడ్డగా పుస్తకం రాశాను నేను చచ్చిపోయిన తర్వాత నరకానికి పోతానేమో అని భయంతోటి రమణస్వామి దగ్గరకి వచ్చాడు. స్వామి అపచారం అయ్యింది. నేను నరకానికి వెళ్లిపోతానేమో, మీ మీద చెడ్డగా పుస్తకం రాశాను అంటాడు. అప్పుడు రమణమహర్షి ప్రశాంతంగా, ఏమీ కూడా రియాక్ట్ అవ్వకుండా. పెరుమాళ్ళూ! నువ్వు నరకానికి పోతానేమో అంటున్నావు. నువ్వు నరకానికి వెళితే నేను కూడా నీ కూడా నరకానికి

వస్తాను నిన్ను రక్షించడానికి అంటారు. కాని నేను నిన్ను అడిగేది ఒకటే, నరకానికి వెళ్ళే పనులు ఎందుకు చేస్తావు? పెరుమాళ్ళు నువ్వు నరకానికి వెళ్ళిపోతా అంటున్నావు, నరకానికి వెళ్ళే పనులు చేయకు. తీరా నువ్వు ఏమంటున్నావు అయిపోయిన తర్వాత? నరకానికి వెళ్ళిపోతా అంటున్నావు. నువ్వు వెళితే నీ కూడా నేను కూడా వస్తాను. నిన్ను రక్షించే తీరతాను పెరుమాళ్ళూ. వాడు గురువు అంటే!

మన శాస్త్రాల్లో మన పెద్దలు ఏమి చెప్పారు మనకి? పెద్ద వాళ్ళ దగ్గరకి వెళ్ళినప్పుడు, దేవుడి దగ్గరకి వెళ్ళినప్పుడు, పువ్వులు పట్టుకెళ్ళమని లేదంటే రూపాయిలు ఇమ్మని, అరటిపండ్లు ఇమ్మని, బత్తాయి ఇమ్మని, ఇవి దేవుడికి పెట్టమన్నారు. ఇవన్నీ ఏమైనా తినేస్తాడా దేవుడు, మనం పట్టుకెళ్ళిన పళ్ళు అన్నీ తింటాడా? నిజంగా మనం పట్టుకెళ్ళిన పళ్ళు తినటం మొదలెడితే, మనం పట్టుకెళతామా? ఇవి కావాలా ఆయనకి? అంటే, ముందు ఈ పండ్లు ఇవ్వటం ద్వారా, ఈ రూపాయి ఇవ్వటం ద్వారా, ఏనాటికైనా ఈ అహంకార లక్షణాలని, జీవ లక్షణాలని, విడిచి పెట్టేస్తాం అని. ఈ త్యాగం చేయటం కోసం, ఆ త్యాగం నేర్పుతున్నారు. పిల్లలు నడిచేటప్పుడు పడిపోతూ ఉంటాడు. కాని నడక బాగా నడిచేవరకు ప్రాక్టీసు చేయించి పిల్లలకి నడక ఎలా అయితే నేర్పుతున్నారో, అదే విధంగా పళ్ళు ఇమ్మని, పువ్వులు ఇమ్మని, ఒక బత్తాయి ఇమ్మని, ఒక ఆపిల్ ఇమ్మని, నారింజకాయ ఇమ్మని దేవుడికి ఎందుకు పెట్టారంటే, ఇవన్నీ ఆయన తింటారు అని కాదు. ఇవన్నీ ఇవ్వటం అలవాటు చేస్తే, ఇలా చిన్న చిన్న పనులు అలవాటు చేస్తే ఎప్పటికైనా మనం జీవ లక్షణాలు వదిలేయగలుగుతామని అలా చెప్పారు. మనకున్న ఈ బయట వస్తువులు త్యాగం చేయటం ముందు నేర్పితే, తర్వాత మనం నేను అనుకుంటున్నటువంటి అహంకార లక్షణాలని, మనం అనుకునే జీవ లక్షణాలని, మనం అనుకునే అజ్ఞాన లక్షణాలని, మనం అనుకునే అవిద్య లక్షణాలని, మనం అనుకునే కల్మష లక్షణాలని త్యాగం చేయగలమని ఇవి అన్నీ మన పెద్దలు ఏర్పాటు చేసారు.

ఈ రోజు ఎల్లమ్మ మన విరోధి, పుల్లమ్మ మన విరోధి అని అనుకుంటాం, కానే కాదు. మనిషికి తను చేసిన పాపమే తన విరోధి. మనకున్న వాసనలే మనకి విరోధులు, మనకున్న తలంపులే మనకి విరోధులు, మనకున్న సంస్కరాలే మనకి విరోధులు. విరోధులు అసలు బయట లేనే లేరు. అయితే గురువు అనుగ్రహం కనుక పడితే, వాడు ఏ జన్మలో ఉన్నప్పటికీ గురువే ఆకర్షించుకుంటాడు. ఎక్కడకి వెళ్ళినా సరే ఆకర్షించుకుంటాడు. రమణ స్వామికి పూర్వ జన్మలో ఒక వ్యక్తి తోటి సంబంధం ఉండేది. అతను ఈ జన్మలో ఎక్కడో పూనాలో మాస్టారు కింద పుట్టాడు. అతను తిరువణ్ణామలై రాలేదు చాలా కాలం, అసలు రమణ స్వామి పేరే వినలేదు. జన్మాంతర సంబంధం ఉంది రమణ స్వామి తోటి, ఏనాటి అనుబంధమో అది! మన అరచేతిలో ఉన్న పండును మనం ఎలా స్పష్టంగా చూడవచ్చో, జీవుడు పోయినపుడు మళ్ళీ ఎక్కడ జన్మిస్తాడో అలాగే కొత్త శరీరం ఎక్కడ వస్తుందో, పాత శరీరం ఏమైపోతుందో జ్ఞానికి స్పష్టంగా తెలుస్తుంది. వాళ్ళు పైకి చెప్పరు. వాడిని జ్ఞానిని చెయ్యటమే వాళ్ళ లక్ష్యం కాని, జన్మల యొక్క గొడవ, దేహాల యొక్క గొడవ లక్ష్యం కాదు.

ఇదంతా స్వప్నం అని జ్ఞానికి తెలుసు. ఆ మాష్టారుకి భగవాన్ స్వప్నంలో కనిపించి నువ్వు నా దగ్గరకి రా అన్నాడు. ఎప్పుడూ భగవాన్ పేరు వినలేదు అతను. నువ్వు నా దగ్గరకి రా అన్నాడు స్వప్నంలో కనిపించి. వీడెవడు నా దగ్గరకి రమ్మంటున్నాడు? ఎప్పుడూ చూడలేదు అతనిని. నీది ఏ ఊరో తెలీదు, నువ్వు ఎవడివో నాకు తెలీదు, నా దగ్గరకి రా అంటే నేను ఎక్కడికి వస్తాను, అని అడిగాడు భగవానుని. గురువు అనుగ్రహం ఎలా ఉంటుందో చూడండి. నేను తిరువణ్ణామలైలో ఉన్నాను. అక్కడికిరా నువ్వు అని ఆయనకి రూపం చూపించి చెప్పాడు. నువ్వు తిరువణ్ణామలై రమ్మని చెబుతున్నావు, కాని నా దగ్గర డబ్బులు లేవు అన్నాడు. స్వప్నంలోనే ఇది అంతా. గురువు అనుగ్రహం చూడండి. యదార్థంగా జరిగిన కథ ఇది. నువ్వు ఫలానా శెట్టి గారిని వెళ్లి డబ్బులు అడుగు అన్నారు, మెలకువ వచ్చింది, భగవాన్ ఏ శెట్టి గారిని అయితే డబ్బులు అడగమన్నారో వాడు పరమలోభి. అసలు ఎవరికీ దానం అనేది చెయ్యడు వాడు. ఎవడు అడిగినా ఇవ్వడు. కాని భగవాన్ అడగమన్నాడు కాబట్టి వెళ్లి అడిగాడు. అంత పరమలోభి కూడా ఇతను ఎంత అడిగితే అంతా ఇచ్చాడు, అవి తీసుకుని తిరువణ్ణామలై వెళ్ళాడు. అది గురువు అనుగ్రహం అంటే! రమ్మని చెప్పిన వారు వారే! తీసుకొచ్చిన వారు వారే! మీల్స్ ఏర్పాటు చేసింది వారే! అందుకే భగవాన్ అన్నారు పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క అయినా బయటకి వస్తుందేమో కాని, గురువు అనుగ్రహంలో పడిన వాడు ఇంక బయటకు రాడు, వాడు రక్షింపబడి తీరతాడు. వాడికి మోక్షం వచ్చే తీరుతుంది.

జ్ఞానం ఇక్కడే ఉంది మనకి, ఆత్మ ఇక్కడే ఉంది, భగవంతుడు ఇక్కడే ఉన్నాడు. మనం అజ్ఞానం వదిలెయ్యాలి. మనం సంపాదించవలసింది ఏమీ లేదు. వదిలి పెట్టవలసింది ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో చాలా మంది ఏమనుకుంటారంటే సంపాదించాలి, సంపాదించాలి అనుకుంటారు. సంపాదించవలసింది ఆధ్యాత్మిక మార్గంలో ఏమీ లేదు. విడిచిపెట్ట వలసినది ఉంది. ఏది విడిచిపెట్టాలి? అజ్ఞానం విడిచిపెట్టు. అహంకారం విడిచిపెట్టు. మమకారం విడిచిపెట్టు. విడిచిపెట్టవలసింది వీటినే. నువ్వు జ్ఞానమే, ఆత్మ నీలోనే ఉంది. ఇవన్నీ ఎందుకు విడిచి పెట్టాలి? నువ్వు పోగుచేసుకున్నావు. జ్ఞానం మన హృదయంలో సహజంగా ఉంది, అజ్ఞానం విడిచిపెడితే అది ప్రకాశిస్తుంది. అజ్ఞానం అంటే ఎలా ఉంటుంది? మన సంస్కారాలే అజ్ఞానం. సంస్కారాలు తీసేస్తే అజ్ఞానం లేదు. గడ్డితాడులో ఉన్న గడ్డి పరకలు ఒక్కొక్కటి తీసేయండి ఇక తాడు ఉండదు. అలాగే ఒకొక్క సంస్కారాన్నే తీసేయండి ఇక అజ్ఞానం లేదు. సంస్కారాల యొక్క మూటే అజ్ఞానంగా కనిపిస్తుంది. కొన్ని కొన్ని తలంపులని మీరు విడిచి పెడదాం అని ప్రయత్నం చేసేకొలదీ అవే ఎదురు వస్తూ ఉంటాయి మీకు. కొన్ని వాసనలు ఉన్నాయనుకోండి విడిచి పెట్టడానికి ప్రయత్నం చేస్తారు. అవే ఎదురు వస్తూ ఉంటాయన్నమాట. ఇంకో చిన్న రహస్యం చెబుతాను, మీకు అవకాశం ఉంటే చేసి చూడండి. ధ్యానం చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు. జపం దేనితోటి చేస్తున్నారు? మనసుతోటి చేస్తున్నారు. ధ్యానం దేనితోటి చేస్తున్నారు? మనసుతోటి చేస్తున్నారు. అది

వదిలేసిన వాడికి ఏ గొడవ లేదు. అది ఉంది కాబట్టి ఏదో ఒకటి చెయ్యవలసి వస్తోంది. అది వదిలేయండి కంప్లీటుగా అసలు మీరు ఏమీ చెయ్యక్కరలేదు. కొన్ని సెకనులు వదిలేయండి మీరు చేయవలసింది అంటూ ఏది లేదు. మీకు జ్ఞానం కలిగిన రోజు ఈ జగత్తు అంతా కూడా మీకు నీటి బొట్టు కింద కనిపిస్తుంది. ఇప్పుడు మీకు చావు అంటే భయం వేస్తుంది కదా, సర్వసాధారణంగా చావంటే భయం వేస్తుంది మనకి. జ్ఞానికి చావంటే అది బహు స్వల్ప విషయం. మీరు మీ మనసుని వదిలేయగలిగితే సెకనులోనే జ్ఞానులు అవుతారు.

మనకి లోకంలో కూడా రియాక్షన్స్ ఎందుకు వస్తాయంటే మన మనసుతోటి చూస్తాం, మనసు తోటి చూడటం వల్ల హెచ్చు తగ్గులు కనిపిస్తాయి. మనసుని తీసేసి చూడండి, మీకు ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు. మీ మనసుని తీసేసి లోకాన్ని చూడండి, అపుడు దుఃఖం వస్తుందేమో? రమణమహర్షి ఏమన్నారంటే నువ్వు ఏ వృత్తిలో ఉన్నా పరవాలేదు అహంవృత్తిలో మాత్రం ఉండద్దు అన్నారు. జీవుడు అంటే ఏంటి అనుకుంటున్నారు? మీ అహంకారమే జీవుడు. మీరు చిన్న విషయం అర్థం చేసుకోండి ఈ శరీరం నేను అని అంటుందా లేక ఈ శరీరం నాది అని నేను అంటున్నానా? అందరికీ తలో శరీరం ఉంది కదా, ఏమైనా అనుమానం ఉందా అందులో. అందరికీ తలొక శరీరం ఉంది, ఏమీ డౌట్ లేదు ఇందులో, పేచీ లేదు కదా. ఈ శరీరం నేను అని చెబుతుందా లేక ఈ శరీరం నాది అంటున్నానా? ఈ సింపుల్ విషయం అర్థం చేసుకోండి, చిన్న విషయం ఇది. ఈ శరీరం నేను నేను అని ఎప్పుడైనా మనతో చెబుతుందా? లేకపోతే ఈ శరీరం నాది నాది అని నేను అంటున్నానా? ఈ శరీరం నేను అని చెప్పటం లేదు. మీరు జాగ్రత్తగా ఆలోచించండి. ఇప్పుడే తేల్చేద్దాం ఇది. మళ్ళీ లెక్కలు అన్ని మీరు ఇంటికి మోసుకు వెళ్లక్కరలేదు. హోం వర్క్ కాదు ఇది. స్కూల్లోనే తేలిపోవాలి! ఈ శరీరం నేను నేను అని ఎప్పుడూ అనదు, మనం నేను నేను అంటున్నాం కదా. ఈ శరీరం నాది నాది అని నేను అంటున్నాను కాని ఈ శరీరం నేను అని ఎప్పుడైనా చెప్పిందా నాతోటి? ఈ శరీరం నాది అనేవాడు ఎవడు? వాడు ఎవడో తెలియకపోతే వాడు జ్ఞాని కాలేడు.

ఈ శరీరానికి జ్వరం వచ్చిందనుకోండి ఈ శరీరం బాధపడుతోందా? నేను బాధపడుతున్నానా? ఈ శరీరాన్ని ఎవరైనా తిట్టారనుకోండి, దూషించారనుకోండి, ద్వేషించారనుకోండి, ఈ శరీరాన్ని ఎవరైనా దూషించినపుడు, ద్వేషించినపుడు ఈ శరీరం బాధపడుతోందా? లోపల ఈ శరీరం నాది అని చెప్పే నేను బాధపడుతున్నానా? మనకి మరణం వచ్చినపుడు నేను చచ్చిపోతున్నాను, నేను చచ్చిపోతున్నాను అనుకుంటాము. నేను చచ్చిపోతున్నా అని ఈ శరీరం చెబుతుందా? ఈ శరీరం లోపల ఉన్నవాడు చెబుతున్నాడా? ఈ శరీరం నాది అని చెప్పుకునే వాడు చెబుతున్నాడా, ఈ శరీరం చెబుతోందా? యదార్థం ఆలోచిస్తే మన ఇంట్లో ఉన్న కంచాలకి, మన ఇంట్లో ఉన్న కుండలకి, మన ఇంట్లో ఉన్న పెట్టెలకి, మన ఇంట్లో ఉన్న వెండి సామాన్లకి, ఈ శరీరానికి ఏమీ తేడా లేదు. మన ఇంట్లో

ఉన్న కంచాలు ఎటువంటివో, మన ఇంట్లో ఉన్న చెంబులు ఎటువంటివో, మన ఇంట్లో గ్లాసులు ఎటువంటివో, ఈ శరీరాలు కూడా అటువంటివే. అయితే కంచాలని జాగ్రత్తగా ఎలా వాడుకుంటున్నామో, చెంబు ఎలా వాడుకుంటున్నామో, గ్లాసు ఎలా వాడుకుంటున్నామో, అలాగే ఉన్నంత కాలం ఈ శరీరాన్ని వాడుకోవటం. గ్లాసు ఏదైనా చిల్లు పడిందనుకోండి, ఆ గ్లాసుని వదిలేస్తున్నాం. కాని గ్లాసు వల్ల ఏడుపు రావటం లేదు, కాని శరీరం పోతే ఏడుపు వస్తుంది. కంచం ఎంత జడ వస్తువో, ఆ కుండ ఎంత జడ వస్తువో ఈ శరీరం కూడా అంతే జడ వస్తువు. ఈ శరీరం నాది అని అంటున్నాను, కాని ఈ శరీరమే గనక నిజంగా నేను అని అంటే, ఎన్నడూ కూడా స్మశానంకి వెళ్ళటానికి ఒప్పుకోదు. కాల్చటం మొదలుపెట్టగానే కలబడుతుంది. ఎవరైతే కాలుస్తున్నారో వాళ్ళ మీద ఎందుకురా నన్ను కాలుస్తున్నారు మీరు? నన్నిలా వల్లకాటిలోకి ఎందుకు తీసుకువచ్చారు? అని లేచి దెబ్బలాడుతుంది. నాకు శరీరం ఉంది కదా? ఈ శరీరాన్ని క్లెయిమ్ చేసేది ఎవడు? ఈ ఆస్తి నాది, ఈ కొబ్బరి చెట్టు నాది, ఈ వంతెన నాది, ఈ మేడ నాది, ఈ ఇల్లు నాది, అని నాలో ఉన్న ఒకడు అన్నీ క్లెయిమ్ చేస్తున్నాడు కదా. అలాగే ఈ శరీరాన్ని కూడా ఒకడు క్లెయిమ్ చేస్తున్నాడు. వాడెవడో తెలియకపోతే, వాడి మూలం తెలియకపోతే, ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని లోకాలకి వెళ్ళినా, మీరు ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని డాక్టరేట్లు పొందినా, ఎన్ని పి.హెచ్.డిలు పుచ్చుకున్నా, ఈ దేశంలో చదివినా, ఇతర దేశాల్లో చదివినా, ఎంత విజ్ఞానం పొందినప్పటికీ, వాడు బంధం లోంచి విడుదల పొందలేడు. ఈ నేను యొక్క మూలం తెలియకపోతే వాడు అజ్ఞానంలో కూరుకుపోవాల్సిందే, వాడు సంసారంలో నాశనం అయ్యిపోవాల్సిందే. ఈ నేను నుంచి ఎవడైతే స్వేచ్ఛని పొందాడో, ఈ నేనుని విడదీసుకోగలిగాడో, వాడు అజ్ఞానం లోంచి, ఈ సంసారం లోంచి, విడుదల పొందుతాడు. ఈ నేను యొక్క సోర్స్ తెలియకపోతే నీకు ఎన్ని సోర్సులు తెలిసినా ఉపయోగం లేదు. నరసాపురం గోదావరి ఉంది, ఆ గోదావరి యొక్క సోర్స్ ఏంటి, ఈ ప్రపంచం ఉంది దాని యొక్క సోర్స్ ఏంటి? ఎన్ని సోర్సు తెలిసినప్పటికీ, ఈ నేను యొక్క సోర్స్ తెలియకపోతే, వాడు బంధం నుండి బయటకి రాలేడు.

మొన్న మార్టేరులో మాట్లాడుతుంటే ఒక ప్రశ్న అడిగారు, అన్నీ మరి కోరికలే కదా కోరికలని విడిచి పెట్టమంటున్నారు కదా, మోక్షం కూడా ఒక కోరికే కదా మరి, దాన్ని విడిచి పెట్టొద్దా అని. మోక్షం కావాలి అనుకోవటం కూడా కోరికే కదా, మరి దానిని విడిచి పెట్టొద్దా? అని అడిగారు. అపుడు ఏమి చెప్పానంటే అతనితోటి, నువ్వు అన్ని కోరికలు పెట్టుకొని అది ఒకటి విడిచి పెట్టేస్తావా? అన్నాను. నువ్వు మొత్తం అన్నీ విడిచి పెట్టేసినపుడు మోక్షం అనే కోరిక కూడా దానంతట అదే పోతుంది. నువ్వు ఏమి చేస్తున్నావు? మిగతా కోరికలు అన్నిటిని దగ్గర పెట్టుకుని మోక్షం కావాలి అనే కోరిక ఒకటే విడిచి పెట్టేస్తా అంటావేంటి? నాకు మోక్షం కావాలి అనే కోరిక ఒకటే నువ్వు విడిచి పెట్టటానికి ప్రయత్నం చేస్తున్నావు. నీకు అది ఒకటే ఉందా? మిగతావి చాలా ఉన్నాయి. ఆ కోరికలను బర్న్ చేయటం కోసం ఈ కోరిక పెట్టారు. ఆ కోరికలను బర్న్ చేస్తే ఇది కూడా బర్న్ అయిపోతుంది.

మోక్షం అనే శబ్దానికి అర్థం ఏమిటి అసలు? విడుదల. మోక్షం అంటే విడుదల అవ్వటం. దేంట్లోంచి విడుదల? అజ్ఞానం లోంచి విడుదల, అహంకారం లోంచి విడుదల. అంటే నేను ఈ శరీరానికే పరిమితం అయిపోవడం అహంకారం. అందులోంచి ఎవడైతే విడుదల పొందాడో అదే మోక్షం. మోక్షం అనే శబ్దానికి అర్థం విడుదల. ఒక శబ్దాన్ని మాట్లాడేటప్పుడు, ఆ శబ్దానికి అర్థం తెలుసుకోవాలి మనం. జైలులోకి ఎప్పుడూ వెళ్లలేదు అనుకోండి ఒకడు, ఏవండీ మీరు జైలు నుండి ఎప్పుడు బయటకి వచ్చారు అని వాడిని అడిగితే అర్థం ఏమిటండి ఆ ప్రశ్నకి? జైలులో కొంతకాలం ఉండి బయటకి వస్తే మీరు జైలు నుండి ఎప్పుడు బయటకి వచ్చారు అని అడగచ్చును. అసలు జైలుకే వెళ్లలేదు అనుకోండి ఒకడు, మీరు ఎప్పుడు బయటకి వచ్చారు అంటే అర్థం ఏంటండి అసలు? మనం బంధంలో ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి మోక్షం అనే ప్రశ్న వచ్చింది. అసలు బంధం లేకపోతే మోక్షమే లేదు. జైలులో ఉన్నవాడు బయటకి వచ్చే ప్రయత్నం చేస్తాడు. అసలు జైలుకే వెళ్లని వాడికి బయటకి రావటానికి ప్రయత్నం ఏంటి అసలు? నువ్వు bondageలో ఉన్నాను అని అనుకుంటున్నావు. నేను బంధంలో ఉన్నాను అనుకుంటున్నావు. అంచేత మోక్షం పొందాలి, విడుదల పొందాలి అని కోరిక ఉంటుంది. అదీ తలంపే, ఇదీ తలంపే. మాకు చాలా బాధలు ఉన్నాయండి బాగా దుఃఖంగా ఉందండి, చాలా బాధలు ఉన్నాయని మీరు అంటూ ఉంటారు చూడండి ఎప్పుడైనా, ఆ కష్టం ఏమిటి? అదీ మీ తలంపే, కష్టం కూడా మీ తలంపే, బాధ కూడా మీ తలంపే, దుఃఖం కూడా ఈ తలంపే. తలంపు లేకుండా మీకు దుఃఖం లేదు. తలంపు లేకుండా బాధ లేదు. మనం చెవి పోటుతో విపరీతంగా బాధ పడతాం. మరి గాఢనిద్రలో చెవి పోటు ఎక్కడికి వెళ్లింది. మీరు బాగా ఆలోచించండి. ఇప్పుడు చెవిపోటు చెవిపోటు అని బాధ పడుతున్నాం. కాని నిద్ర పట్టేసింది మనకి, నిద్ర పట్టేసినప్పుడు నీకు చెవి పోటు గొడవ ఏదైనా ఉందా? మరి చెవి పోటు ఎప్పుడు వస్తోంది? మనకి తెల్లారి లేచాక తలంపు వస్తోంది. తలంపు వచ్చాక మళ్లీ చెవిపోటు చెవిపోటు అంటున్నాం. చెవి పోటు ఉన్నప్పుడు కూడా, చెవిపోటుకి చెవి బాధపడుతుందా, నువ్వు బాధపడుతున్నావా? మరి నిజంగా నీ చెవే బాధపడుతుంటే, నీకు నిద్రలో బాధ ఎందుకు లేదు? నీకు తలంపు రాక ముందు బాధ అనేది ఉందా అసలు? ఈ చెవిపోటు కూడా నీకు తలంపు వచ్చాకే కదా, నీకు బాధ వస్తుంది. తలంపు లేనప్పుడు ఆ బాధ కూడా లేదు. దుఃఖం కూడా నీకు తలంపు వచ్చాకే వస్తుంది, తలంపు లేనప్పుడు దుఃఖం కూడా లేదు.

జ్ఞాపకం ఉంచుకోండి. చాలామంది ముసలి వాళ్ళు ఏమనుకుంటారంటే మనకు వాసనలు తగ్గాయి అనుకుంటారు. అలా ఎవరూ అనుకోవద్దు. ముసలితనం వస్తుంది చూడండి, మనలో ఎనభైలు, తొంభైలు వచ్చిన వాళ్ళు వాళ్లకి వాసనలు తగ్గినప్పుడు ముసలి వాళ్ళు చాలా మంది ఏమనుకుంటారంటే మనకు వాసనలు తగ్గిపోయినాయి అనుకుంటారు. వాసనలు తగ్గలేదు. శరీరం ఒడలింది. అంటే బాహ్య ఇంద్రియాలు ఒడలినాయి, లోపల ఇంద్రియాలు మటుకు ఏమీవంగవు. ఈ శరీరానికి ముసలితనం కాని, వాటికి ముసలితనం

లేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక మాట చెప్పారు. పండు ఉందనుకోండి బయటకి చూస్తే ముగ్గినట్టు కనపడుతుంది కాని లోపల గింజలు మటుకుగట్టిగా ఉంటాయి అని చెప్పారు. పండేమో బయట నొక్కితే మెత్తబడుతుంది, కాని లోపల ఎలా ఉంటాయి గింజలు? గట్టిగా ఉంటాయి. మళ్ళీ ఆ గింజలు మనం భూమిలో పాతిపెడితే మొక్క అవుతుంది. అలాగే మీ శరీరం ముసలిది అవ్వచ్చు, లోపల వాసనలు అనే గింజలు గట్టిగానే ఉంటాయి, మళ్ళీ కొత్త జన్మలో శరీరం తీసుకురావడం కోసం అని ఠాగూర్ చెప్పారు. అసలు achievement ఏమీ లేదు జీవితంలో, మీ మనసు ఏమైనా కొంత దూరం లోపలకి దిగిందా? మీ హృదయం వైపుకి మనసు ప్రయాణం చేస్తుందా? ట్రూత్ ని తెలుసుకోవడం కోసం మనసు ఏమైనా కృషి చేస్తోందా? మనసు యొక్క ఎఫర్ట్ ఏమైనా ఉందా? మీరు నిజాన్ని తెలుసుకోవడం మానేసి బాహ్య శరీరంతో మీరు ఎంత achieve చేసినప్పటికీ, లోక వ్యవహారాలు అన్నీ కూడా స్వప్నంతో సమానం అంటున్నారు ఆచార్యుల వారు. శరీరం వచ్చిందంటే, ట్రూత్‌ని తెలుసుకోడానికి అవకాశం వచ్చింది. అంటే ట్రూత్‌ని తెలుసుకునే ఎఫర్ట్ వదిలేసి, లోకంలో ఏదో సాధించారంటే అదంతా స్వప్నంతో సమానం అంటున్నారు ఆచార్యుల వారు.

తలంపు ఎక్కడ పుడుతుందో అక్కడ చూస్తే మీకు తేలిగ్గా అది పడిపోతుంది. తలంపు పుట్టిన చోట చూడటం మానేసి అది శిరస్సులో విజృంభించాక దానిని పడగొట్టటం కష్టం. దీనిలో ఇంకో రహస్యం ఉంది. మనలో చాలా మంది మేము బుద్ధిమంతులం అనుకుంటూ ఉండచ్చు. వాళ్ళు ఎంతవరకు బుద్ధిమంతులో వారికే తెలియదు. లోపలున్న వాసన తలంపు రూపంలో వచ్చే వరకూ, వాడికి కూడా తెలియదు పాపం ఆ వాసన ఉన్నట్టు, మీరు బాగా గ్రహించండి. మీలో ఫలానా వాసనలు ఉన్నట్టు, ఆ వాసన తలంపు రూపంలో వస్తేనే గాని, ఆ వాసన ఉన్నట్టు మీకు కూడా తెలీదు. లోపల గనక వాసన లేకపోతే తలంపు పుట్టదు. తలంపు వచ్చే వరకు మీకు ఆ వాసన ఉన్నట్టు మీకే తెలిదు. వాసన ఏమో సూక్ష్మ రూపంలో ఉంటుంది. తలంపు వచ్చేటప్పటికి స్థూలం అవుతుంది. స్థూలం అయ్యాకే మీకు తెలుస్తుంది. వాసన సూక్ష్మ రూపంలో ఉన్నప్పుడు మీకు కూడా తెలియదు. భగవంతుడు లేడు అని మనకు అనిపిస్తుంది. దీనికి కారణం ఏమిటి? మన వాసనలు. లోక వాసన, దేహ వాసన, శాస్త్ర వాసన, గణపతి శాస్త్రి గారినేమో శాస్త్ర వాసన ఆపుజేసింది. కొంతమందికి లోక వాసన ఆపుచేసేస్తుంది. మనకేమో దేహ వాసన ఆపుచేస్తుంది. శాస్త్ర వాసన, లోక వాసనలని పడగొట్టగలం గాని దేహ వాసనని ఎవరమూ పడగొట్టటం చాలా కష్టం.

సాధన చేయటానికి ఎవరం మనం? గురువే చేస్తాడు. మీ మనసు, ఎంతవరకూ చేస్తుంది సాధన! పొద్దున్న ఉన్న మాట మధ్యాహ్నం ఉండదు. మధ్యాహ్నం ఉన్న మాట సాయంత్రం ఉండదు. విశ్వాసం కూడా ఏ గంటకి ఆ గంట మారిపోతూ ఉంటుంది. ఇది చేసే సాధన ఎంత సేపు, ఏమి సాధన చేస్తుంది? మీ మనసుని తీసుకెళ్ళి కొంతకాలం దాని పుట్టింటికాడ పడేస్తే, ఏమైనా కొంత దారిలోకి రావచ్చు. అది అత్తారింటి దగ్గర ఉండగా ఏదీ సాధ్యం కాదు. మనసుకి పుట్టిల్లు ఏమిటంటే, భగవంతుడు. మనసుకి అత్తవారిల్లు ఈ

శిరస్సు. కొంతమంది అంటారు చూడండి, చాలా గొడవలు వచ్చేస్తున్నాయండి మా బుర్రలోకి, అస్సలు కుదురు ఉండటం లేదండి అని. అంటే ఇది అత్తారిల్లు అన్నమాట. ఈ శిరస్సు ఏమో అత్తారిల్లు. చచ్చిపోయేటప్పుడు ఈ అత్తోరిల్లు గొడవ ఎక్కువగా ఉంటుంది. మరణించేటప్పుడు విపరీతమైన ఘర్షణ వస్తుంది. లోపల మాత్రం విపరీతమైన పోరాటం జరుగుతుంది. వాడిలో ఉన్న సంస్కారాల మధ్య, అంటే వాడిలో కొన్ని మంచి వాసనలు ఉంటాయి, చెడ్డ వాసనలు ఉంటాయి, వాటి మధ్య విపరీతమైన పోరాటం, భారత యుద్ధం అంత పోరాటం జరుగుతుంది. బయటకి మనకి ఏమీ కనపడదు. లోపల వాడికి ఎంత పోరాటం జరుగుతోందో! మనసు తన పుట్టుకకు స్థానం అయినటువంటి ఆత్మలో, తన పుట్టుక స్థానం అయినటువంటి భగవంతుడిలో నిలబడి కొంత కాలం గనక ఉంటే అది పడిపోతుంది. దాని పుట్టుక స్థానం వదిలేసి, అంటే దాని పుట్టుక స్థానం అయిన ఆత్మను, భగవంతుడిని. వదిలేసి శిరస్సులోకి వచ్చి, అంటే ప్రకృతిలోకి వచ్చి విజృంభిస్తున్నంత కాలం, దానిని ఆపు చేయలేము.

మనం నోటితోటి మాట్లాడచ్చు, పశువులకి భాష రాకపోవచ్చు. భగవాన్ దగ్గరికి వచ్చే జంతువుల భాషలు అన్నీ తెలుసు ఆయనకి. పాముల భాష తెలుసు, పక్షుల భాష తెలుసు, కోతుల భాష తెలుసు, కుక్కల భాష తెలుసు. అన్నీ తెలుసు. వాటికి మనకి తోలు తేడా తప్పించి ఇంకేమీ లేదు అన్నారు భగవాన్. ఆకుకూరలవ్వ లక్ష్మిగా పుట్టింది. ఆకుకూరలవ్వ లక్ష్మి అనే శరీరంతో గోవు రూపంలో పుట్టింది. గోవు రూపంలో వచ్చిన లక్ష్మికి భగవాన్ అంటే ఎంత ఇష్టం అంటే, లక్ష్మి దూడగా ఉన్నప్పుడు, తిరువణ్ణామలై టౌన్లో కట్టేస్తే తాడు కూడా తెంపుకుని రమణ ఆశ్రమానికి పారిపోయి వచ్చేసింది. దూడగా ఉన్నప్పుడు తల్లి దగ్గర పాలు తాగే వయసు, దానికి ఎవరు చెప్పారు? ఈ విషయమే మీరు గ్రహించాలి, అది భగవద్గీత చదువుకుందా, లేకపోతే సత్సంగంలో ఏమైనా మీటింగులు విందా, ఎవరు చెప్పారు? ఎవరు చెబితే వచ్చింది ఆ ఆవు దూడకి అంత భక్తి? ఇదే మీరు గ్రహించాలి. పేపరు చదువుకుంటున్నారు అనుకోండి భగవాన్, ఆయన ముఖానికి, పేపరుకు మధ్య తన ముట్టి పెట్టేది, మాటలు రావు కదా! దాని ప్రేమ చూడండి. దాని మీద చెయ్యి వేసి, లక్ష్మి లక్ష్మి లక్ష్మి అనేవారు. ఆయన చేత్తో మోక్షం ఇచ్చిన జీవులలో లక్ష్మి అనే ఆవు కూడా ఒకటి. ఇంతకీ నేను చెప్పేది, ఆ దూడ ఏమి చదువుకుంది? ఏమి పారాయణ చేసింది? ఏమి పూజ చేసింది? ఏమి జపం చేసింది? ఏమి యజ్ఞం చేసింది? ఏమి నోము నోచింది? ఆవు దూడే ఇంతా చేస్తే! పూర్వ జన్మ సంస్కారం గనక లేకపోతే దానికి ఇంత ప్రేమ హృదయంలో నుండి ఎక్కడ పుట్టుకొచ్చింది? అందుకే భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. నువ్వు చేసిన పుణ్యం వూరికే పోదు. నువ్వు చేసిన మంచి వూరికే పోదు. నువ్వు సాధించినది ఏదీకూడా పోదు. అది జన్మాంతరంలో నీ కూడా వస్తుంది. మంచి చేసిన వాడికి దుర్గతి లేదు. భగవంతుడి వైపుగా మీరు చేస్తున్న ప్రయాణం ఊరికే తెగిపోతుంది అనుకోకండి. ఈ శరీరం పడిపోవచ్చు కాని ప్రయాణం మాత్రం కంటిన్యూ అవుతుంది.

దేహాలు మారవచ్చును కాని ప్రయాణం మాత్రం కంటిన్యూ అవుతుంది. అది ఏమైనా

శాస్త్రాలు శ్రవణం చేసిందా? దానికి అంత భక్తి ఎక్కడి నుంచి వచ్చింది? జన్మాంతర సంస్కారం నుండి తప్పితే, ఎక్కడి నుండి వచ్చింది? ఇప్పుడు మీరందరూ ఏ స్థితిలో ఉన్నారంటే, భక్తి నేర్చుకుందాం అనే స్థితిలో ఉన్నారు. కొంతకాలానికి ఎటువంటి స్థితి వస్తుంది? ఈ భక్తి వలలో నుండి బయట పడదాం అనుకుంటే కూడా పడలేరు. ఇది కూడా మర్చిపోకండి. ఇప్పుడు మీరు భక్తిని పట్టుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు, తరువాత భక్తి మిమ్మల్ని పట్టుకుంటుంది. మిమ్మల్ని పట్టుకుని ఏమి చేస్తుంది? ఈ భక్తి గొడవ వదిలేద్దాం, జారిపోదాం అని ఎంత ప్రయత్నం చేసినా మీరు జారలేరు. ఇప్పుడు మీరు భక్తిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు, తరువాత భక్తి మిమ్మల్ని పట్టుకుంటుంది. ఆ స్టేజి వచ్చిన తరువాత మీరు ఎక్కడికీ పారిపోలేరు.

ఆత్మసుఖం, ఆత్మశాంతి మీకు అనుభవంలోనికి వచ్చేవరకు ఇంద్రియాలు మిమ్మల్ని విడిచిపెట్టవు. ఇది మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఏ జీవుడికి ఆ జీవుడు ఆత్మ సుఖం తెలుసుకునే వరకు, ఆ జీవుడిని ఇంద్రియాలు విడిచి పెట్టవు. ఎప్పుడైతే ఆత్మ సుఖం తెలిసిందో, ఆత్మ శాంతి తెలిసిందో అప్పుడు విడిచిపెడతాయి. మీ చేతిలో రూపాయి ఉందనుకోండి, ఆ రూపాయి కింద పడేయమంటే మీరు పడేయరు. మీరు ఆ రూపాయి కింద పడేయండి, నేను మీకు రెండు రూపాయలు ఇస్తాను అంటే పడేస్తారు. ఎందుకంటే రెండు రూపాయల కాగితం మీకు ఆకర్షణగా ఉంటుంది. ఇప్పుడు మీరు ఇంద్రియాలతోటి అనుభవించే సుఖం కంటే కూడా అతీతమైన సుఖం మీ మనసుకి గనుక దొరికితే, ఇంతకంటే మీ హృదయాంతరాలలోంచి వస్తున్న అతీతమైన శాంతి మీకు దొరికితే, అప్పుడు ఇంద్రియాలని వదిలేసి మనసు అంతర్ముఖం అవుతుంది. కాని మాములుగా ఆత్మ సుఖం తెలియక ముందు ఎంత మెట్టవేదాంతం చెప్పుకున్నా ఇంద్రియాలలోకి వచ్చేస్తుంది గాని ఆత్మ వైపు ప్రయాణించదు. భగవంతుడి వైపు ప్రయాణించదు. అనుభవంలో మీకు ఆ పట్టు చిక్కాలి. ఆ అనుభవం మీకు లోపల వస్తుందా? బయట వస్తుందా? మీకు లోపలే రావాలి. హృదయం నిర్మలంగా ఉంచుకోండి. మనస్సు నిర్మలంగా ఉంచుకోండి. ఇంద్రియాలని ప్రశాంతంగా నిర్మలంగా ఉంచుకోండి. మంచి తలంపులు వచ్చేలాగా జాగ్రత్తగా చూసుకోండి. సత్పురుషుల యొక్క సహవాసం చేయండి. సత్పురుషుల సహవాసం ఎందుకు చెయ్యాలంటే దారి చూపించే వాళ్ళు వాళ్ళే. అసలు దారి తెలియాలి కదా మనకి. అందుచేత సత్పురుషుల సహవాసం చెయ్యాలి. కల్పవృక్షం కామధేనువు అడిగినవి ఇస్తాయి, సత్పురుషుల సహవాసం మనకు కావలసినవన్నీ సమకూరుస్తుంది.

ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు. మీకు కోటి రూపాయలు ఉంటే, దానాలు చేసుకుంటే పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. మరి జ్ఞానం ఎలా వస్తుంది? వినాలి, వినాలి, శ్రవణం చేయాలి. ఆత్మ గురించి భగవంతుడు గురించి వినాలి. చెవులు గళ్ళు పడిపోయేలా వినాలి. చిల్లులు పడిపోవాలి చెవులు! అలా విన్న దాన్ని లోపలకు తీసుకోవాలి. చెవులు ఉన్నాయి కాని మేము వినం. కళ్ళు ఉన్నాయి కాని మేము చూడము ,అంటే నేను

చెప్పేది వ్యర్థం. పువ్వుతో కొంతమంది భగవంతుడిని ఆరాధిస్తారు. మీ పని ద్వారా, మీ మాటలు ద్వారా భగవంతుడిని ఆరాధించండి. మీ చేష్టల ద్వారా భగవంతుడిని ఆరాధించండి. జీవితాన్ని సాధ్యమనైనంత వరకు నిర్మలంగా, ప్రశాంతంగా మనసులో గందరగోళం పెట్టుకోకుండా, మనసుని కుదురుగా ఉంచుకుని హెచ్చు తగ్గులు లేకుండా ప్రశాంతంగా జీవించండి. మన రక్షకుడు ఈశ్వరుడు, మన తోడు ఈశ్వరుడే, మన నీడ ఈశ్వరుడే, ఎన్ని జన్మలెత్తినా ఈశ్వరుడే మనకి గురువు. ఈశ్వరుడిని నిరంతరం హృదయంలో ఆరాధించండి.

ఈశ్వరుడిని మీరు స్మరిస్తున్నారు అంటే, ఈశ్వరుడి యొక్క అనుగ్రహం మీ మీద ఉన్నట్టే. నిరంతరం ఈశ్వరుడి యొక్క ప్రేమ కోసం తపించాలి. మీ హృదయంలో ఈశ్వరుడి మీద కనుక ప్రేమ పుడితే, వేరే ఏసాధన మీరు చెయ్యనక్కరలేదు. ఎందుచేత అంటే ఈశ్వరుడి పట్ల ఉన్న ఈ ప్రేమ సమస్త సాధనలు చేసుకుపోతుంది. ఈశ్వరుడి మీద ప్రేమ మీ మనసులో కుదరాలి కాని, ఆ ప్రేమ సమస్తము కూడా పర్ఫెక్టుగా కండిషనులోకి తీసుకొచ్చేస్తుంది ఆ ప్రేమ. లవ్ హిమ్, ఆల్వేస్ లవ్ హిమ్, మోర్ లవ్ హిమ్, మోర్ అండ్ మోర్ లవ్ హిమ్! ఈశ్వరుడిని ప్రేమించండి, సదా ప్రేమించండి, నిరంతరము ప్రేమించండి. మీకు ఈ దేహం తోటి సంబంధం తెగిపోతుంది కాని, ఈశ్వరుడితోటి సంబంధం తెగదు కాబట్టి, ఈశ్వరుడి తోటి బంధం అనుబంధం పెంచుకోండి. మన నిజమైన ఇల్లు ఈశ్వరుడే.

ఆచార్యుల వారు చెప్పింది ఈ లోకం అంతా మాయ అని. ఈ లోకం మాయ అని ఎవరికి తెలుస్తుంది? ఈశ్వరుడిని దర్శించిన వారికి తెలుస్తుంది, నిజాన్ని మన మనసు నమ్మదు. మన మనస్సు నమ్మేది నిజం కాదు. ఇది అర్థం చేసుకోండి. ఎందుచేత నిజాన్ని మన మనస్సు నమ్మదు? మనస్సు నిజం కాదు కాబట్టి! అయితే ఈ మనస్సుని దాటి ఎవడు వెళ్ళగలడు? నిరంతరమూ ఈశ్వరుడిమీద ప్రేమ ఎవరైతే పెంచుకున్నాడో వాడే ఈ మనస్సును దాటి, ఈ మాయలోంచి తప్పుకొని బయటకి వెళ్ళగలడు. మాయ ఎవరి చేతిలో ఉంది? ఈశ్వరుడి చేతిలో ఉంది. అందుచేత ఈశ్వరుడిని ఆశ్రయిస్తే మనం మాయని జయించగలం. మాయ ఎవరి కంట్రోల్‌లో ఉందో ఆ కంట్రోలర్‌ని మనం ఆశ్రయిస్తే మనం మాయ నుండి బయట పడతాం.

ఇంకొకటి, మీరు మరచిపోవద్దు, ఇంత చాదస్తంగా ఎందుకు చెబుతున్నాను అంటే, మీ శరీరానికి ఎంత బలం ఉందో, మీ మనసుకు ఎంత బలం ఉందో, మీ వాసనకి ఎంత బలం ఉందో, మీ సంస్కారాలకి ఎంత బలం ఉందో, మీ కోరికలకి ఎంత బలం ఉందో, అంతకంటే కోటి రెట్లు ఎక్కువ బలం ఆత్మకి, ఈశ్వరుడుకి ఉంది. అందుచేత ఆయన అనుగ్రహం మీ మీద పడితే, మీ అజ్ఞానం అంతా దూది కొట్టుకు పోయినట్టు కొట్టుకుపోతుంది. గాలివాన వచ్చిందనుకోండి పెద్ద పెద్ద తాటి చెట్లే పడిపోతాయి. ఈ గడ్డిపరకలు దూది ఎగరటం కష్టమా! అదే ఈశ్వరానుగ్రహం అనే గాలి మన మీద పడితే ఈ వాసనలన్నీ ఎంతసేపు కొట్టుకుపోతాయి! ఆయన ప్రేమ మన మీద పడాలే గాని, ఈ వాసనలు తీసివేయటం మనకి కష్టం కాని ఆయనకి కష్టం కాదు.

మా తెలివి తేటలు వల్ల ఈ వాసనలను బయటకి గెంటేస్తాము అని కొంతమంది అనుకోవచ్చు. ఈ తెలివి తేటలు ఎందుకు పనికి వస్తాయంటే కొంపలు కాల్చటానికి పనికి వస్తాయి. మనిషిని మనిషిని దూరం చెయ్యటానికి పనికి వస్తాయి. కొంపలు ముంచటానికి పనికి వస్తాయి. ఈ తెలివి తేటలు దేవుడిని తెలుసుకోలేవు. ఈ గందరగోళం అంతా తెలివితేటలు తెచ్చిపెడుతున్నాయి. ఇంట్లో సమస్యలు, వీధిలో సమస్యలు తెచ్చిపెట్టే వాళ్ళు చాలా మంది మేము తెలివైన వాళ్ళం అనుకునే వాళ్ళే! ఇటువంటి తెలివి తేటలా భగవంతుడిని తెలుసుకొనేవి! ఇటువంటి  తెలివి తేటలతోటా ఇంద్రియాలని జయించేది? ఇటువంటి తెలివి తేటలతోటా మనసుని స్వాధీనం చేసుకునేది? నా తెలివి నాకు అపకారం చేస్తుంటే, ఆ తెలివి నాకు ఎందుకు? నా డబ్బు నాకు అపకారం చేస్తుంటే ఆ డబ్బు నాకు ఎందుకు? నా చదువు నాకు అపకారం చేస్తుంటే ఆ చదువు నాకు ఎందుకు? నా ఇంద్రియాలు నాకు అపకారం చేస్తుంటే ఆ ఇంద్రియాలు నాకు ఎందుకు? యేసు అంటాడు నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే, ఆ కళ్ళు పీకి అవతల పాడేయ్. తాత్కాలికంగా గుడ్డివాడిగా ఉండటం మంచిది, శాశ్వతంగా నరకంలో పడటం కంటే!

మన గమ్యం జ్ఞానం, జ్ఞానం మన స్వరూపం. నన్ను నేను తెలుసుకోవడం మానేసి ఈ నేనుని అట్టే పెట్టి, ఈ నేను తోటి లోకంలోని విద్యలు అన్నీ సంపాదించినప్పటికీ, నేను అజ్ఞానంలోనే ఉంటాను, నరకంలో ఉంటాను. ఎవరైతే ఈ నేనుని ఈశ్వరుడి పాదాల దగ్గర బలి చేస్తున్నారో, ఈశ్వరుడి పాదాల దగ్గర పుష్పాలు పెట్టినట్టు, ఎవరైతే ఈ నేనుని తీసేసి ఈశ్వరుడి పాదాల ముందు సమర్పిస్తున్నా ఎవరైతే ఈ మనస్సు అనే పుష్పాన్ని, ఈ అహంకారాన్ని, ఈశ్వరుడికి సమర్పిస్తున్నారో, ఎవడైతే తన భోగాలని ఈశ్వరుడి కోసం త్యాగం చేస్తున్నాడో వాడు ఈశ్వరుడి స్వరూపం పొందుతాడు.

సోదర మహాశయులారా! డబ్బు ఉన్నవాడికి శాంతి కలగదు, చదువు ఉన్న వాడికి శాంతి కలగదు. ప్రేమ ఉన్న వాడికి శాంతి కలుగుతుంది. డబ్బు చెడ్డది కాదు. చదువు ఉంటే ఉండచ్చు, చదువు చెడ్డది కాదు. అంత మాత్రం చేతనే మీకు శాంతి వస్తుందని మీరు అనుకోవద్దు. చదువూ చెడ్డది కాదు, డబ్బూ చెడ్డది కాదు. అవి శక్తులే కాని అవి ఉన్నాయి కదా అని మనకి శాంతి వచ్చేస్తుంది అని మీరు అనుకోవద్దు. ఎవరికి శాంతి వస్తుందంటే, ఎవరి హృదయం ప్రేమ పూరితమో, వారికి శాంతి వస్తుంది. అంత వరకు మనలని అశాంతి వెంటాడుతుంది. అశాంతి ఉన్న వాడికి సుఖం ఎక్కడనుంచి వస్తుంది? అశాంతిలో కూరుకుపోయిన మనిషి ఎవరైనా సుఖ పడటం చూసారా?

ఓం శాంతిః శాంతిః శాంతిః



# అరుణాచల మహత్యం
# అక్షరమణమాల

**చెప్పక చెప్పి నీవు మౌనతనుండని**
**ఊరక ఉందువే అరుణాచలా!**

**తాత్పర్యము:** నన్ను మౌనంగా ఉండమని నీవు నోటితో చెప్పకుండానే చెప్పి, నీవు కూడా అలా మౌనంగా (కొండ రూపమున) ఉండిపోయావేమిటి అరుణాచలా!

ఓ అరుణాచలా! చెప్పకుండా చెప్పావు నువ్వు మౌనంగా ఉండమని. మనం మౌనంగా ఉండలేము. ఒక్క ఐదు నిమిషాలు మీరు మౌనంగా కూర్చోండి అంటే మనం మౌనంగా కూర్చోలేము. ఎంతసేపైనా మాట్లాడగలం కానీ మౌనంగా ఉండలేము. మౌనంగా ఉండటానికి అలవాటు పడలేదు మనం. మౌనం అనేది చాలా గొప్పది. మాటల కంటే మౌనమే విశేషమైనది. మౌనంలోంచే శక్తి వస్తుంది. మాటకంటే మౌనంలోనే ఎక్కువ శక్తి ఉంది. కానీ మౌనం యొక్క విలువ మనకి తెలియటం లేదు. ఇక్కడ రమణస్వామి అరుణాచలేశ్వరునితో అంటున్నాడు, చెప్పకుండానే చెప్పావు నువ్వు నన్ను మౌనంగా ఉండమని. అయితే దీనికి మాటలతోటి పని లేదు. మాటలతోటి నిమిత్తం లేదు. చాలా మంది అనుకుంటారు, మౌనం సందేశాన్ని ఇవ్వలేదేమో అని. మౌనం కూడా సందేశాన్ని ఇస్తుంది. ఉదాత్తమైనటువంటి, ఉజ్జ్వలమైనటువంటి, అపూర్వమైనటువంటి శక్తి తరంగాలు మౌనంలోంచి వస్తాయి. ఇంగ్లీషులో కూడా ఒక సామెత ఉంది "మాటలు వెండి, మౌనం మట్టుకు బంగారం తోటి సమానము" అని. మౌనం బంగారం, మాటలు వెండి. అంచేత మౌనం చాలా గొప్పది. ఒక హృదయం ఇంకొక హృదయాన్ని అర్థం చేసుకొన్నప్పుడు మాటలతోటి పని లేదు. మీ హృదయాన్ని నేను, నా హృదయాన్ని మీరు అర్థం చేసుకొనే శక్తి ఉన్నప్పుడు, మాటలతోటి పని లేదు.

రమణస్వామి పేరు వినటం వల్ల, ఆయనని దర్శనం చెయ్యటం వల్ల, ఆయన మాటలతోటి నిమిత్తం లేకుండా అనేక మంది జీవితాలు మారిపోయాయి. ఎక్కడైతే పవిత్రత

ఉందో, ఎక్కడైతే ఏకాగ్రత ఉందో, ఎక్కడైతే జీవితంలో బ్యూటీ ఉందో, ఆ మనిషిని చూసినప్పుడు మనలో తప్పనిసరిగా మార్పు వస్తుంది. మన జీవిత విధానం మార్చుకుంటాం, జ్ఞానం వైపుకి మన ముఖాన్ని తిప్పుకుంటాము. రాజేంద్ర ప్రసాద్ ఒకసారి భగవానుని అడిగాడు, స్వామీ మహాత్మా గాంధీజీ నన్ను మీ దగ్గరికి పంపించారు, మీరు చెప్పవలసిన మాటలు ఉంటే నేను బాపూజీతో చెపుతాను అన్నాడు. అప్పుడు రమణ స్వామి ఏంచెప్పారంటే, హృదయం హృదయంతోటి మాట్లాడేటప్పుడు మాటలతోటి పని లేదు అన్నారు. అలాగే "చెప్పక చెప్పి నీవు మౌనతనుండని", చెప్పకుండానే చెప్పావు మౌనంగా ఉండమని. ఊరక ఉందువే అరుణాచలా - నువ్వు కూడా ఊరక ఉన్నావు అరుణాచలా. ఏమీ మాట్లాడకుండానే మౌనంగానే ఉండిపోయావు అరుణాచలా. మనకి ఏవో మాటలు ఊరతానే ఉంటాయి.

సోదరామహాశయులారా! మనం మాటలు మాట్లాడతాము. ఈ మాటలతోటి దేవుడిని పట్టుకోలేము. దేవుడి గురించిన అనుభవం మీకు లేనప్పుడు, నోటితోటి దేవుడు ఉన్నాడు అని చెప్పినా ఒకటే, దేవుడు లేడని చెప్పినా ఒకటే. దేవుడు ఉన్నాడని చెప్పేవాడికి, దేవుడు లేడని చెప్పేవాడికి తేడా లేదు. సోదరామహాశయులారా, పరమేశ్వరుడు మాటలకి దొరికేవాడు కాదు. ఆయన మీ ఆలోచనలకి, మీ తలంపులకి, మీ ఊహలకి, మీ ఆదర్శాలకి, మీ ఆశయాలకి, మీ ఆకాంక్షలకి దొరకడు. నువ్వు చెప్పే మాటలకి కానీ, నువ్వు పెట్టే నమస్కారాలకి కానీ, మోసపోవటానికి భగవంతుడు అమాయకుడు ఏమీ కాదు. నాకు ఏవో ఊహలు వస్తున్నాయి, నాకు ఆలోచనలు వస్తున్నాయి, నాకు ఏవో తలంపులు వస్తున్నాయి అని నువ్వు అనుకోవచ్చు. తలంపు తోటి కూడా భగవంతుడిని పట్టుకోలేము. తలంపు కంటే, మాట కంటే ఇక్కడ మౌనం గొప్పది. ఏమండీ మేమూ మౌనంగానే ఉంటున్నాము అండీ, మేమూ నోరు మూసుకునే ఉంటున్నాము అని మీరు అనవచ్చు. నోరు మూసుకున్న వాళ్ళందరూ మౌనంగా ఉన్నట్టు కాదు. మీరు నోరు మూసుకొని ఉండవచ్చు కాని మీ మనస్సు ఎక్కడికి తిరిగి వస్తుందో, ఎన్ని ఊళ్ళు వెళ్తుందో. నిజమైన మౌనం ఎవరికి కుదురుతుంది అంటే, నిజమైన ధ్యానం ఎవడైతే చేస్తున్నాడో వాడు నిజమైన మౌని. మన ఉపనిషత్తులలో ధ్యానం చెయ్యమని చెప్పారు. ధ్యానానికి టాప్ మోస్ట్ ఇంపార్టెన్స్ ఇచ్చారు. అంటే ధ్యానం చేసిన వాడికి మాత్రమే మౌనం కుదురుతుంది. ధ్యాని మట్టుకే మౌని అవ్వగలడు. రమణ స్వామి మౌనం యొక్క గొప్పతనం గురించి చెపుతున్నాడు. నీకు ధ్యాస కుదిరితే ధ్యానం కుదురుతుంది. మీకు ధ్యానం కలిగినప్పుడే నిజమైనటువంటి మౌన స్థితి వస్తుంది. ధ్యానం ఎలా కుదురుతుంది? ఈశ్వరుడిని ప్రేమించాలి! ఈశ్వరుడిని ప్రేమించకుండా ధ్యానం చేస్తున్నామని మీరు ఎవరైనా అంటే పంచదార లేని కాఫీ, పంచదార లేని టీ, ఎలా ఉంటుందో, మీకు ఈశ్వరుడి పట్ల ప్రేమ లేకుండా, ఇష్టం లేకుండా, నేను ధ్యానం చేస్తున్నాను అనేటువంటి మాటలు అలాగే ఉంటాయి. ఈశ్వరుడి పట్ల ప్రేమని పెంచుకోవాలి, అది మీరు అభివృద్ధి చేసుకోవాలి.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

భగవద్గీతని బాగా చదివి అధ్యయనం చేసి అర్థం చేసుకుంటే, మీకు అభ్యాసం చెయ్యాలనే బుద్ధి కలుగుతుంది. అభ్యాసం కూడా ఒక యోగం. మీరు అర్థం చేసుకున్నది అభ్యాసం చేస్తే, అప్పుడు మీకు డైరెక్టుగా అనుభవంలోకి వస్తుంది.

**లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః**

**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూత హితే రతాః(5-25)**

**తాత్పర్యము:** పాపరహితులును, జ్ఞాన ప్రభావమున సమస్త సంశయముల నివృత్తిని సాధించినవారును, సర్వప్రాణుల హితమును కోరువారును, నిశ్చలస్థితితో మనస్సును పరమాత్మ యందు లగ్నము చేసిన వారును అగు బ్రహ్మవేత్తలు బ్రహ్మ నిర్వాణమును పొందుదురు.

ఎవడు బ్రహ్మ నిర్వాణం పొందుతాడు? ఎవడు బ్రాహ్మీస్థితిని పొందుతాడు? అంటే - "క్షీణకల్మషాః" - అంటే పాపమును పోగొట్టుకొనిన వాడు. నీ జీవితం కృతిమంగా ఉండకూడదు. నీ జీవితం సరళంగా, సహజంగా ఉంటే కల్మషం నశిస్తుంది. నువ్వు చెయ్యవలసిన సాధన ఏమిటి అంటే, నీలో ఉన్న పరమాత్మని కనిపెట్టటం కాదు. ఇప్పుడు మనం ఆరోగ్యంగా ఉన్నాము, ఏదో రోగం వస్తుంది. ఆ రోగం తగ్గిన తరువాత ఆ రోగం లేనప్పుడు ఎలా ఉన్నామో మళ్ళీ ఆ స్థితికి వచ్చేస్తాము. అలాగే నువ్వు కల్మషం లేనప్పుడు ఏ సహజస్థితిలో ఉన్నావో, నీలో ఉన్న కల్మషం పోగొట్టుకున్నాక అదే సహజస్థితిలోకి నువ్వు వచ్చేస్తావు. అందుచేత నువ్వు సాధన చేసి, అభ్యాసం చేసి, వివేకము పెంచుకొని నీలో ఉన్న కల్మషాన్ని పోగొట్టుకో అన్నాడు పరమాత్మ.

ఇతరులని అంచనా వేయటంలో వివేకం ఉండాలి. నిన్ను నువ్వు తెలుసుకోవటానికి జ్ఞానం కావాలి. భవిష్యత్తులో డబ్బు ఉన్నా కాని తెలివితేటలు లేనివాడు ఈ భూమి మీద బతకలేడు.

మీ పిల్లలకి డబ్బు సంపాదించి ఇచ్చి వాళ్లకి మీరు తెలివితేటలు నేర్పకపోతే వాళ్ళు పాడైపోతారు. ఒక పని ఒకడు స్వార్థంతోటి చేస్తూ ఉంటే పతనమవుతాడు. వాడికి పునర్జన్మలు పెరుగుతాయి. అదే పనిని నువ్వు స్వార్థరహితంగా కనుక చేస్తే, నువ్వు ఆధ్యాత్మికంగా, నైతికంగా, అభివృద్ధిలోనికి వస్తావు. నువ్వు చేసే కర్మే నీ అభివృద్ధికి కారణం, నీ పతనానికీ కారణం.

**ఛిన్నద్వైధా:** అంటే సంశయములు లేనివారు. కొంతమందికి ప్రతిదానికి సంశయం. మేము దేవుడు ఉన్నాడు అని చెబుతాము అనుకోండి, ఏదో నాన్నగారు చెప్పారు, అసలు దేవుడు ఉన్నాడో లేడో, బహుశా దేవుడు లేడేమో అనుకుంటారు. మీకు ఆరోగ్యం బావుంది అనుకోండి, రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అనుకోండి, అందరూ మిమ్మల్ని అమ్మగారు, అయ్యగారు అంటున్నారు అనుకోండి, అసలు ఏదోక రోజున మనకి చావు వస్తుంది అనే సంగతి కూడా మీరు మరిచిపోతారు. మాయ అంత బలీయమైనది. అటువంటప్పుడు మీరు దేవుడిని మరిచిపోవటంలో ఆశ్చర్యమేముంది. మీకు సంశయం పనికిరాదు.

మీకు జిన్నూరులో ఉన్న 7000 మంది వచ్చి భగవంతుడు లేడని చెప్పినా మీకు ఉన్న విశ్వాసం చలించకూడదు. అప్పుడు భగవంతుడి అనుగ్రహం మీకు వస్తుంది. మనకి ఆత్మవిశ్వాసం లేనప్పుడు ఇతరులు ఏది చెబితే అదే నిజం అనుకుంటాము. నువ్వు చేసే సాధన మీద నీకు నమ్మకం లేనప్పుడు, మానసికంగా బలహీనుడు అయిన వాడికే భగవంతుడు ఉన్నాడా లేడా అని అనుమానం వస్తూ ఉంటుంది. ఇంతవరకూ ఈ సృష్టిలో ఏ బలహీనుడికీ ఆత్మజ్ఞానం రాలేదు అన్నాడు పరమాత్మ.

మీకు సందేహాలు ఉంటే, అలా పెట్టుకుని ఉండకండి. సందేహం కాలులో ముల్లు లాంటిది, కంటిలో నలుసులాంటిది. కంటిలో నలుసు ఉంటే ఎంత బాధపెడుతుందో, కాలిలో ముళ్ళు కూడా అంతే బాధపెడుతుంది. నీకు ఏమైనా సందేహాలు, సంశయాలు ఉంటే అవి పోగొట్టుకోవటానికి గురువుని ఆశ్రయించి వినయంగా, విధేయతతోటి, తెలుసుకోవాలనే కాంక్షతోటి అడిగితే అప్పుడు గురువుకు దయ కలిగి చెబుతాడు. మీరు అడిగే విధానం ఎలా ఉండాలి అంటే, గురువుకి చెప్పాలనే బుద్ధి కలిగేలా ఉండాలి. అప్పుడు కాని గురువు కూడా చెప్పడు. అందుచేత భగవంతుడి పట్ల మీకు ఏమైనా సందేహాలు ఉంటే, గురువుని అడిగి ఆ సందేహాలు తొలిగించుకోండి.

రమణమహర్షి గారిని ఒకరు అడిగారు, మనకి ఎడమవైపున ఫిజికల్ హార్ట్ ఉంటుంది, కుడివైపున స్పిరిట్యువల్ హార్ట్ ఉంటుందని మీరు చెబుతున్నారు. మరి మాకు ఎడమవైపు బీటింగు తెలుస్తోంది కదా, మరి కుడివైపున స్పిరిట్యువల్ హార్ట్ ఉంటే అది మాకు ఎందుకు తెలియటం లేదు అని అడిగారు. అది అనుభవం వలన మీకు తెలుస్తుంది. స్పిరిట్యువల్ హార్ట్ మన శరీరంలో ఒక భాగం కాదు. అలాగని అది లేదని కాదు. అది వట్టిమాటలతోటి తెలియబడదు. అది అనుభవం వలన మీకు తెలుస్తుంది. మనం చేస్తున్న

సాధనతో పాటు గురువు అనుగ్రహం ఉండాలి. శాస్త్రం యొక్క అనుగ్రహం ఉండాలి. మీరు మంచివాళ్లమని అనుకుంటే అది తెలియబడదు. మీరు ఉత్తములు అని లోపలఉన్న సద్వస్తువు అనుకోవాలి. అప్పుడు ఆ సద్వస్తువు తెలియబడుతుంది. నీ లోపలఉన్న సద్వస్తువు గోడలాంటిది కాదు, అది జడవస్తువు కాదు. అది నీ ఆలోచనలకి, నీ తలంపులకి, నువ్వు చేసే పనులకి సాక్షిగా ఉంటుంది. అందుచేత జడ్జిమెంట్ అది చెప్పాలి కాని నేను ఉత్తముడిని, మంచి వాడిని అని నీవు అనుకుంటే అనుకో. కాని నీకు సహృదయం ఉంది, నీకు సద్బుద్ధి ఉంది, నీ జీవితం అంతా గాడ్ సెంటర్డ్ అని అది అనుకున్నప్పుడు నీకు ఆ సద్వస్తువు తెలియబడుతుంది. కాని నువ్వు అనుకుంటే అది తెలియబడదు. మీకు అది తెలియబడాలంటే మీలో కల్మషం పోవాలి. వ్యక్తిభావన పోవాలి, మనోగతమైన నేను లోంచి మీరు విడుదల పొందాలి. లేకపోతే ఆ సద్వస్తువు మీకు తెలియబడదు. మీరు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి కాని, ఈ దేహగతమైన నేనుని ప్రమాణంగా పెట్టుకొని జీవించకూడదు. నువ్వు ఏదైతే నేను నేను అనుకుంటున్నావో అది నిజం కాదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి రావాలి. మన హృదయంలో ఒక నిజం ఉందని కూడా మనకి అర్థం అవ్వటంలేదు. సత్పురుషులు, మహాత్ములు, మహర్షులు, యోగులు, అవతారపురుషుల యొక్క సహవాసం వలన హృదయంలో ఒక నిజం ఉందని నీకు తెలియబడుతుంది. మీకు ఆ రుచి తెలిసాక, అభ్యాసం చెయ్యాలి అనిపిస్తుంది. భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం, నమ్మకం, మనం వదిలిపెట్టకూడదు.

రామకృష్ణపరమహంస శరీరం వదిలిపెట్టిన తరువాత కొంతమంది శిష్యులు చెదిరిపోయారు. వాళ్ల ఇంటి దగ్గర వాళ్ళు, మీరు వివేకానంద జతలు పట్టవద్దు అనేవారు. ఆ శిష్యులు మంచివాళ్ళే. ఆ ఇంట్లోవాళ్ళు దారి తప్పించేసారు. నరేంద్రుడు ఆ చెదిరిపోయిన పిల్లల ఇంటికి వెళ్ళేవాడు. నరేంద్రుడిని చూసి వీడు మన పిల్లల్ని పాడుచేస్తున్నాడు అని వాడు దూరంగా ఉండగానే తలుపులు వేసేసుకునేవారు. వాళ్ళు బయట కనిపించినప్పుడు నరేంద్రుడు చెప్పేవాడు. మీ తల్లితండ్రులు మిమ్మల్ని పెళ్లి చేసుకోమంటున్నారు. దానికి ఏమీ తప్పులేదు, మీరు చదువుకున్నారు కాబట్టి ఉద్యోగాలు చేసుకొని మిమ్మల్ని డబ్బు సంపాదించుకో మంటున్నారు. సంసారపక్షంగా అది తప్పని నేను చెప్పటం లేదు. కానీ మన గురువు బ్రతికి ఉండగా ఏమి చెప్పాడో అది మీరు గుర్తుపెట్టుకోండి. మీరు పెళ్లి చేసుకుంటే పెళ్లి అబద్ధం, మీరు చదివిన చదువులు అబద్ధం, మీరు డబ్బు సంపాదించుకుంటే మీ డబ్బు అబద్ధం. ప్రపంచంలో ఏదైనా ఒక నిజం అంటూ ఉంటే, మన గురుదేవుడు రామకృష్ణుడు ఏ స్థితిని పొందాడో, అది ఒక్కటి మాత్రమే నిజం. మిగతావి ఏవీ నిజం కాదు, అన్నీ అబద్ధాలే. దానిని బట్టి మీరు ఆలోచించుకోండి అని చెప్పి వెళ్ళేవాడు. నరేంద్రుడు గురువు పట్ల ఎంత విశ్వాసపాత్రుడు అయితే అలా మాట్లాడగలడు! వాడికి సందేహాలు ఉంటే, ఆ మాట చెప్పలేడు

కదా! నరేంద్రుడు మన ఇండియా వాడు అయినా ప్రాపంచిక పౌరుడు. ఇండియాని ఎంత ప్రేమించాడో ప్రపంచాన్ని కూడా అంతే ప్రేమించాడు. నరేంద్రుడు బీదవాళ్లని మరింతగా ప్రేమించాడు. అన్నం తినటానికి కంచం దగ్గర కూర్చుంటే, ఎవరైనా బీదవాడు కనిపిస్తే నరేంద్రుడు అన్నం మానేసి వాడికి పెట్టేసేవాడు.

**యతాత్మానః** అంటే ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం కలవారు. మీకు అన్ని భోగాలు అందుబాటులో ఉండాలి, ఆ భోగాల మీద మీ మనస్సు వాలకూడదు. అప్పుడు వాడు నిగ్రహం కలవాడు అని కాళిదాసు చెప్పాడు. మీకు జున్ను అంటే ఇష్టం అనుకోండి, మాకు జున్ను ఇష్టం లేదు అని మామూలుగా మీరు అంటారు కాని జున్ను ఎదురుగుండా పెడితే తినేస్తారు. మనం నక్కల్లా తయారు అయ్యాం. ఎలాగంటే నక్కలకు ద్రాక్షపళ్ళు అందలేదు కాబట్టి ద్రాక్షపళ్ళు పుల్లన అంటాయి. ద్రాక్షపళ్ళు అందితే నక్కలు తినేస్తాయి. మీకు జున్ను ఎలాగా దొరకదు కాబట్టి ఇష్టం లేదు అంటున్నారు. దొరికితే తినేస్తారు. అలాగ మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు. అన్ని భోగాలు మీకు ఎదురుగుండా ఉన్నప్పటికీ మనస్సు చలించకూడదు అది యతాత్మానః

**సర్వభూతహితే రతాః** అంటే సర్వ ప్రాణుల యొక్క హితవు కోరుట. నువ్వు అందరికీ సహాయం చేయలేకపోవచ్చు. అందరూ క్షేమంగా ఉండాలని నువ్వు కోరుకో. నీకు ఇంటి దగ్గర దారిద్ర్యం ఉన్నా నీ హృదయంలో దారిద్ర్యం పనికిరాదు. అందుచేత నువ్వు ఇతరుల క్షేమం కోరుకోవటంలో మట్టుకు నువ్వు దరిద్రుడిగా ఉండకు. మీ శత్రువుల క్షేమం కూడా కోరుకో. శత్రువులు, స్నేహితులు, బంధువులు, వీళ్ళందరూ మనోకల్పితాలే. మొత్తం అంతా నీ మైండ్ క్రియేషన్. స్వప్నంలో జరిగేది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం.

పాపమును పోగొట్టుకొనినవాడు, సంశయములు లేనివాడు, ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము కలవాడు, సమస్త ప్రాణుల యొక్క హితము కోరువాడు, ఈ క్వాలిఫికేషన్స్ ఉన్నవాడు బ్రహ్మముతో ఒకటి అయిపోతాడు. అట్టివాడు మాత్రమే మోక్షాన్ని పొందగలడు. చాలా విషయాలలో మనల్ని మనం మోసం చేసుకొంటున్నాము. మనం దేహాత్మబుద్ధి పెట్టుకొని, బ్రహ్మాత్మబుద్ధి ఉంది అనుకొంటున్నాము. ఆత్మకి చావు లేదు అని భగవంతుడు చెబుతున్నాడు. దేహం చనిపోయినప్పుడు మనం చనిపోతున్నాము అని అనుకుంటున్నాము. అంటే మనకి దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధి లేదు. ఆత్మబుద్ధి ఉన్నవాడు దేహం చనిపోయినప్పుడు, నేను చనిపోతున్నాను అని అనుకోడు. మనం ఎల్‌కేజీ చదువుతూ పీజీలో ఉన్నాం అనుకుంటే ఎలాగ? అది ఆత్మవంచన అంటున్నారు. ఇప్పుడు నీకు దేహాత్మ బుద్ధే ఉంది కాని నువ్వు బ్రహ్మాత్మ బుద్ధి ఉంది అనుకుంటే నష్టపోతావు. ఇలా నిన్ను నువ్వు మోసం చేసుకోవద్దు.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | |
|---|---|
| డిసెంబరు 10 | అరుణాచల జ్యోతి ఉత్సవము |
| డిసెంబరు 15 | ఆదివారం మ॥ గం॥ 2-00లకు అమలాపురం మాష్టారు ప్రవచనం |
| జనవరి 6 | సద్గురు శ్రీ నాన్నగారి ఆరాధన ఉత్సవం |
| జనవరి 11 | భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి ఉత్సవం |

### దిll 10-12-2019 జయవారం
# అరుణాచల జ్యోతి ఉత్సవము

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | పూజా కార్యక్రమములు, భూసూక్త పారాయణ దక్షిణామూర్తి స్తోత్ర పారాయణ, రుద్రాభిషేకము |
| | 11-00లకు | అన్న ప్రసాద వితరణ |
| మ॥గం॥ | 1-00లకు | భీమవరం సీతారామరాజు (రాము) గారి ప్రవచనము |
| సా॥గం॥ | 5-00లకు | పూజా కార్యక్రమములు |
| | 6-00లకు | జ్యోతి ప్రజ్వలన |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

### దిll 06-01-2020 సోమవారం
# సద్గురు శ్రీ నాన్నగారి ఆరాధన ఉత్సవం

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | అల్పాహారం |
| | 8-00లకు | పూజాకార్యక్రమములు |
| | 9-00లకు | డాక్టర్ ఉషగారి ప్రవచనము |
| | 11-00లకు | అన్న ప్రసాదం |
| మ॥గం॥ | 1-00లకు | హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

### దిll 11-01-2020 సోమవారం
# భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి ఉత్సవం

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | అల్పాహారం |
| | 8-00లకు | పూజాకార్యక్రమములు |
| | 9-00లకు | భక్తుల ప్రవచనములు |
| | 11-00లకు | అన్నప్రసాదం |
| మ॥గం॥ | 1-00లకు | హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

# మీ అహంకారాన్ని స్వీకరించి సత్యాన్ని మీకందించేవాడే అసలైన గురువు

అజ్ఞానమే పాపమని చెప్పబడుతుంది. ఈ పాపము విచారణ వల్ల దూరమైపోతుంది. "ఈ జ్ఞానాన్ని అభ్యాస, వైరాగ్యాల ద్వారా ఇంద్రియాలను వశం చేసుకోవచ్చు. సాధింపరానిది ఏదీ లేదు" అని గీతాచార్యులు అన్నారు. "మన అహంకారం నాకు అన్నీ తెలిసిపోయింది" అంటుంది. ఆ వ్యక్తి నేర్చుకొనే సామర్థ్యం పూర్తిగా సమాప్తమౌతుంది. అహంకార పోకడలు తెలుసుకోవటానికి జీవితాంతం కృషి చెయ్యాలి. గమనించకపోతే దాని మాయలోపడి పతనావస్థకు చేరువవుతాము. ఒక మహమ్మదీయ జ్ఞానిని ఆయన అంతిమ సమయంలో కొందరు ఇలా అన్నారు మీరు మీ జీవితంలో కృతార్థులయ్యారు అనగా ఆయన "నా జీవితకాలం ఇంకా ఐదు నిమిషాలు ఉంది. మాయ ఏ క్షణంలోనైనా నన్ను తాకవచ్చు నేను మరణించాక కావాలంటే అనుకోండి" అన్నారు. జీవితంలో సంఘటనలను అహంకారం తలపోస్తుంది, దానిని ఆపాలి, కారణం జరిగిపోయినదేదో జరిగిపోయింది. గడచినది ఏనాటికీ రాదు. దానిని గురించి పశ్చాత్తాపపడవలసిన పని లేదు. మళ్లీ ఆ పొరపాట్లు చెయ్యకుండా ఉండటానికి జ్ఞాపకం మాత్రం ఉంచుకోవాలి. ఒకరు మనకు హాని చేసినను దానిని మన్నించటం చాలా మంచిది. అసలు ఆ హానినే మరిచిపోవటం ఇంకా మంచిది. కారణం మన ప్రారబ్ధంలో దానినే మనపై మన గురువు ఉసిగొల్పి దానిని రహితం చేస్తున్నారు అనే ఎరుక ఉండాలి. గురువు యొక్క ప్రేమను గొంతు వరకూ నిండేంత వరకూ త్రాగాలి. అతని ఉనికిని జీర్ణించుకోవాలి ఆయన సన్నిధిలో గడ్డకట్టిన మన అహంకారం ఆయన వెచ్చతనం వల్ల కరిగిపోతుంది. వారితో ఒకటైపోతే ద్వంద్వాన్ని వదిలేయవచ్చును. గురుప్రేమ వల్లనే మనలో సత్యం ఉదయిస్తుంది. అది ఎంతో దూరంలో లేదు. ఆయన కాంతిలో మనం జాగృతులమవుతాము. గురువు శరీరం వాడినా ఆయన ధ్యాసవల్ల మనకు సత్యపోషకాలు అందుతాయి. అప్పుడు ఇలా అనిపిస్తుంది "సాక్షాత్కారాన్ని వదిలిపెట్టుకోవటానికి సిద్ధంగా ఉంటాను గాని గురువును మాత్రం వదలను. గురువుతో సత్సంగం ముందు సాక్షాత్కారం ఏపాటిది?". గోపికలు అంటారు "మోక్షం అంటారు ఏదో అంటారు మాకు కృష్ణ ప్రేమలోనే అంతులేని ఆనందం కలుగుతోంది". వారి భావన మనం పుణికిపుచ్చుకొంటే గురువు మన మనస్సును సత్యం వైపు ధర్మం వైపుగా తిప్పుతారు. మనస్సు నెమ్మదిగా పాత తిరుగుబోతు తనం మాయమౌతుంది. పోనుపోను శాంతిస్తుంది. ఎలా అంటే అలలు లేని సరస్సులా తయారవుతుంది. అప్పుడు సత్యం దానిలో ప్రవేశిస్తుందని అనుభవజ్ఞులు చెబుతారు. దానినే శంకర భగవత్పాదు "నిశ్చల చిత్తే జీవన్ముక్తి" అన్నారు. మనలను గతవాసనలు లాక్కుపోతూ ఉంటాయి. మన జీవిత లక్ష్యం నుంచి తప్పిపోయినప్పుడు మన గురువు పదే పదే తిరిగి వర్తమానంలోకి చేరుస్తాడు. అహంకారం మత్తగజం. దానిని అదుపులో ఉంచాలంటే గురువు యొక్క అంకుశంతో గడగడలాడి, నిదానంగా వెళుతుంది సత్యంవైపుకు. గురు శరీరం లేనప్పుడే ఎక్కువ మందికి సత్యాన్ని తెలుసుకోగలరు అది రామకృష్ణులు, రమణుల జీవితాలే ఉదాహరణ. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**